# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

12 YEARS PEN POWER JOURNEY 2014 - 2026 ప్రశ్నించడం మన హక్కు

విశాఖపట్నం | హైదరాబాద్ | ఉభయ గోదావరి | ఎన్. టీ. ఆర్ | గుంటూరు | ప్రకాశం | నెల్లూరు | తిరుపతి | చిత్తూరు | కడప

సంపుటి : 2 సంచిక : 37 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు ఆదివారం 11 అక్టోబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :2 ISSUE :37 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE SUN 11 OCTOBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur


## విజయవాడలో టెన్షన్.. షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు




- 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకే ఈ చర్యలు
- సీఈసీ రాజీనామా కోరుతూ ఇండియా కూటమి నిరసన
- కార్యక్రమానికి అనుమతి లేదని స్పష్టం చేసిన పోలీసులు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. గన్నవరం సమీపంలోని కేసరపల్లిలో

- మిగతా 2లో

## ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం



- అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని నారాయణ ఆదేశాలు
- అక్టోబర్ 2028 నాటికి రాజధాని పూర్తి చేయడమే లక్ష్యమని వెల్లడి
- ఐకానిక్ టవర్ల పనులను పరిశీలించిన మంత్రి నారాయణ

పెన్ పవర్ డెస్క్:ఏపీ రాజధాని అమరావతి నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు 2028 అక్టోబరు నాటికి పూర్తి చేయడమే లక్ష్యమని రాష్ట్ర మంత్రి నారాయణ స్పష్టం చేశారు. ఆయన రాజధాని ప్రాంతంలో పర్యటించి, ఐకానిక్ టవర్ల నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం

- మిగతా 2లో

# స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఖరారు..

## ఏపీ కేబినెట్ కీలక నిర్ణయం

- రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ సిఫార్సులకు కేబినెట్ ఆమోదం
- పలు పదవులకు 24 శాతం నుంచి 35 శాతం వరకు రిజర్వేషన్లు
- కూటమి పక్షాల ద్వారా 34 శాతతం సీట్లు బీసీలకు కేటాయిస్తామని హామీ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బీసీ రిజర్వేషన్లపై చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చంద్రబాబు అధ్యక్షతన ఈరోజు జరిగిన కేబినెట్ సమావేశంలో... రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ చేసిన సిఫార్సులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదించిన వివరాల ప్రకారం... స్థానిక సంస్థల్లో వివిధ పదవులకు కొత్త బీసీ రిజర్వేషన్ల శాతాలను ఖరారు చేశారు. ఇందులో మేయర్లకు 35.29 శాతం, మున్సిపల్ ఛైర్‌పర్సన్లకు 33.02 శాతం, పట్టణ వార్డు సభ్యులకు 32.78 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయి. అలాగే, సర్పంచ్‌లకు 27.95 శాతం, ఎంపీటీసీలకు 25.55 శాతం, ఎంపీపీలు, జెడ్పీటీసీలకు 24.60 శాతం చొప్పున కోటా కేటాయించారు. జెడ్పీ ఛైర్‌పర్సన్లకు మాత్రం 23.08 శాతం రిజర్వేషన్లు అమలు చేయనున్నారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ ప్రతిపాదనను సుప్రీంకోర్టు తిరస్కరించిన నేపథ్యంలో ఈ నిర్ణయం ప్రాధాన్యత సంతరించుకుంది. కోర్టు తీర్పును గౌరవిస్తూ, నిబంధనలకు అనుగుణంగా బీసీలకు లబ్ధి చేకూర్చేలా ఈ రిజర్వేషన్లను ఖరారు చేసినట్లు మంత్రులు తెలిపారు. గత ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ల కన్నా ఇవి మెరుగ్గా ఉన్నాయని వారు పేర్కొన్నారు. చట్టపరంగా రిజర్వేషన్లు అందిస్తూనే, కూటమి పక్షాల మధ్య సీట్ల పంపకాల ద్వారా మొత్తం మీద 34 శాతం ప్రయోజనం బీసీలకు దక్కేలా చూస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.




# జగన్‌కు ఈడీ షాక్..

## అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

- జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్
- రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన
- దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు
- విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది.సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది.గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.



## ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?

### కేంద్రంపై నారాయణ తీవ్ర ఆగ్రహం

- ఢిల్లీలో నిర్బంధంపై కేంద్ర ప్రభుత్వంపై సీపీఐ నారాయణ ఫైర్
- తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపుపై హర్షం
- కమ్యూనిస్టులను ఓడించాలన్న కాంగ్రెస్‌పై విమర్శలు

పెన్ పవర్ డెస్క్:సీపీఐ సీనియర్ నేత నారాయణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించారని,

- మిగతా 2లో

## ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు..

### ఒకే రోజు రెండుసార్లు ప్రకంపనలు




- ఉత్తరాఖండ్‌ను వణికించిన మరో భూకంపం
- ఉత్తరకాశీలో 4.2 తీవ్రతతో ప్రకంపనలు
- శనివారం ఒక్కరోజే రెండుసార్లు కంపించిన భూమి
- బాగేశ్వర్‌లోనూ స్వల్ప తీవ్రతతో భూకంపం
- కొద్దిరోజుల క్రితం చమోలీలోనూ కంపించిన ధరణి

- మిగతా 2లో

## గెస్ట్‌హౌస్‌పై కర్ణాటకకు టీటీడీ వార్నింగ్.. స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

- తిరుమల గెస్ట్‌హౌస్‌పై కర్ణాటక ప్రభుత్వంతో టీటీడీకి వివాదం
- పవిత్ర స్థలాన్ని వ్యాపార కేంద్రంగా మార్చాలని చూస్తున్నారని ఆరోపణ
- నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

పెన్ పవర్ డెస్క్:తిరుమలలోని కర్ణాటక ప్రభుత్వ గెస్ట్‌హౌస్ వ్యవహారంపై టీటీడీ తీవ్రంగా స్పందించింది. వివాదాస్పద నిర్ణయాన్ని కర్ణాటక సర్కార్ వెనక్కి తీసుకోకపోతే, ఆ గెస్ట్‌హౌస్‌ను స్వాధీనం చేసుకుంటామని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు. పవిత్ర పుణ్యక్షేత్రాన్ని వ్యాపార కేంద్రంగా మార్చేందుకు కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు

- మిగతా 2లో





## ఢిల్లీలో ఉద్రిక్తత.. కేజ్రీవాల్, మమతా బెనర్జీ అదుపులోకి.. పోలీసులపై రాళ్ల దాడి

పెన్ పవర్ డెస్క్: సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనతో దేశ రాజధాని ఢిల్లీ అట్టుడికిపోతుంది. జంతర్ మంతర్ దగ్గర నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆందోళనకారులు పెద్ద ఎత్తున ఢిల్లీకి చేరుకున్నారు. అయితే, సీజేపీ ప్రొటెస్ట్?కు అనుమతి లేదంటూ

- మిగతా 2లో



## ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- ఆదివారం ప్రత్యేకంగా సుప్రీంకోర్టు విచారణ
- మెట్రో మూసివేతపై కోర్టు ధిక్కరణ పిటిషన్
- ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలకు డిమాండ్
- నిరసనకారుల నిర్బంధంపైనా మరో పిటిషన్
- ప్రజా రవాణా పూర్తిగా నిలిపివేయొద్దన్న కోర్టు

- మిగతా 2లో

## కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ భేటీ.. తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్!

పెన్ పవర్ డెస్క్:తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసు కుంది. కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, తమిళనాడు సీఎం, టీవీకే అధినేత సి. జోసెఫ్

- మిగతా 2లో



## 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

పెన్ పవర్ డెస్క్: ఢిల్లీలో నిరసన తెలిపేందుకు వచ్చిన యువతను అదుపులోకి తీసుకోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా తీవ్రంగా స్పందించారు. ప్రభుత్వ వైఫల్యాలు బయటపడతాయనే భయంతోనే నిరసనలను అడ్డుకుంటున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసే చర్యలకు పాల్పడుతున్నవారు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఢిల్లీలో పై 'చేయి' ఎవరిది ?!

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగ యువతను కాక్రోచెస్ పోల్చడంతో వ్యంగ్యంగా మొదలైన కాక్రోచ్ జనతాపార్టీ నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను కోరుతూ జంతర్ మంతర్ లో చేసిన ఆందోళనలతో బలపడింది. సీజేపీ ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న కేంద్రం చివరకు ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించాల్సి వచ్చింది.సర్ ప్రక్రియలో భాగంగా దేశంలో సుమారు 13 కోట్ల ఓట్లు తొలగించిన నేపథ్యంలో ఎన్నికల కమీషన్ లో ఉన్న ఇద్దరు కమీషనర్లు సుఖ్ బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు 14 సార్లు సర్ కు ప్రక్రియ కొనసాగుతున్న వివాదం మీద అభ్యంతరాలు నమోదు చేసినట్లు వార్తలు బయటకు వచ్చాయి.దీంతో అర్హులైన ఓటర్లను ఓటు హక్కు నుంచి దూరం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఓటు డాటా బేస్ నిర్ణయాల్లో పారదర్శకత లేకపోవడాన్ని ప్రతిపక్షాలు, సీజేపీ దీనిని ఓటు చోరీగా పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే సీజేపీ 'జంతర్ మంతర్ 2.0' పేరుతో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్వర్ కుమార్ రాజీనామాను డిమాండ్ చేస్తూ జంతర్ మంతర్ వద్ద నిరసనలకు పిలుపునిచ్చింది.సీజేపీ ఆందోళనలకు పోలీసులు అనుమతులు నిరాకరించారు. 25 వేల పారామిలటరీ బలగాలను మోహరించారు. రైళ్లను రద్దు చేశారు. 45 మెట్రో స్టేషన్లలో ఆంక్షలు విధించారు. ట్రాఫిక్ పెద్ద ఎత్తున మళ్లించారు. దీంతో ఢిల్లీలో ట్రాఫిక్ జామ్ కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో ఆందోళన చేసేందుకు ఢిల్లీకి వచ్చిన సీజేపీ అధినేత అభిజిత్ దీప్కే, నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రంకాలను ముంబై నుంచి ఢిల్లీకి వచ్చిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ లో ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో అరెస్ట్ చేశారు. ప్రముఖ యూట్యూబర్ ధృవ్ రాఠీని గురుగ్రామ్ లో, సీజేపీ లీగల్ టీమ్ హెడ్ రత్నసింగ్ ను వారి నివాసంలో అదుపులోకి తీసుకున్నారు. రైళ్లు రద్దు చేస్తూ ఆందోళనలు అదుపులోకి తేవాలని చేసిన ప్రభుత్వ చర్యలపై 'ఈగను చంపడానికి సుత్తిని ఉపయోగిస్తారా' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.ప్రస్తుతం ఢిల్లీలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రభుత్వ చర్యలను సీజేపీ నియంతృత్వం, యువతను ప్రభుత్వం భయపెడుతోందని, మోడీ ఓటమి అంగీకరించాడని చెబుతుంది. ఢిల్లీని కంటోన్మెంట్ గా మార్చారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.గతంలో జరిగిన ఆందోళనలు మొదట తేలిగ్గా తీసుకున్న ప్రభుత్వం తర్వాత అణచివేతకు కఠినంగా వ్యవహరించింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తాయి. చివరకు కేంద్ర మంత్రి రాజీనామా చేయక తప్పలేదు. ప్రస్తుత ప్రభుత్వ చర్యలు నివారణాత్మకమేనా ? లేక అణచివేతనా ? అరెస్టు అయినవారు, అదుపులోకి తీసుకున్న వారు ఎప్పుడు విడుదల అవుతారు ? నిరసన ఎలా ముందుకు సాగుతుంది అన్న ఉత్కంఠ నెలకొంది. ఢిల్లీలో జరుగుతున్న ఆందోళనలో ఎవరిది పైచేయి అవుతుందో తెలియాలంటే వేచిచూడాల్సిందే.

# విజయవాడలో టెన్షన్.. షర్మిలను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

- మొదటి పేజి తరువాయి

ఉన్న ఆమె నివాసం వద్ద ఉదయం నుంచే భారీగా పోలీసులను మోహరించారు. ఇండియా కూటమి పార్టీలు విజయవాడలో తలపెట్టిన 'చలో రాజ్‌భవన్' కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు.ఓటర్ల జాబితా నుంచి పెద్ద ఎత్తున పేర్లు తొలగించారని ఆరోపిస్తూ, కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఈ ఉదయం 10 గంటలకు విజయవాడలోని లెనిన్ సెంటర్ నుంచి రాజ్‌భవన్ వరకు యాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. అయితే, ఈ కార్యక్రమానికి ఎలాంటి అనుమతి లేదని పోలీసులు స్పష్టం చేశారు.ఈ నేపథ్యంలోనే షర్మిలతో పాటు పలువురు కాంగ్రెస్, వామపక్ష పార్టీల కీలక నేతలను పోలీసులు ఎక్కడికక్కడ గృహనిర్బంధం చేస్తున్నారు. మరోవైపు, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రాజ్‌భవన్ వద్ద కూడా భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసుల ఆంక్షల నడుమ షర్మిల ఇంటి నుంచి బయటకు వస్తారా, లేదా అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. తదుపరి పరిణామాలు ఎలా ఉంటాయోనని సర్వత్ర ఆసక్తి నెలకొంది.

# ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నాం

- మొదటి పేజి తరువాయి

సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులు, కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో సమావేశమై పనుల పురోగతిపై సమీక్షించారు.
ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత నెలలో వర్షాల కారణంగా పనులకు కొంత ఆటంకం కలిగిందని, ఇప్పుడు పనులు తిరిగి వేగం పుంజుకున్నాయని తెలిపారు. ఐకానిక్ టవర్ల నిర్మాణంలో మొదటి డయాగ్రిడ్ పూర్తయిందని, ప్రతి రెండు నెలలకు 6 అంతస్తుల నిర్మాణం పూర్తయ్యేలా లక్ష్యం నిర్దేశించామని వివరించారు. ఐకానిక్ అసెంబ్లీ, హైకోర్టు ఫౌండేషన్ పనులు కూడా దాదాపుగా పూర్తయ్యాయని చెప్పారు. అధికారులు, ప్రజాప్రతినిధుల నివాస భవనాలు తుది దశకు చేరుకున్నాయని, నవంబర్ 11 తర్వాత వాటి ప్రారంభోత్సవాలు ప్రారంభిస్తామని వెల్లడించారు. ల్యాండ్ పూలింగ్ జరుగుతున్న గ్రామాల్లో ప్రస్తుతానికి స్థానిక ఎన్నికలను పెండింగ్ లో పెడుతున్నామని తెలిపారు.రాజధాని నిర్మాణంపై కొందరు అవాకులు చవాకులు పేలుతున్నారని నారాయణ మండిపడ్డారు. విమర్శలు చేసేవారు అమరావతికి వచ్చి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిని చూస్తే

వాస్తవాలు తెలుస్తాయని అన్నారు. ప్రస్తుతం రాజధాని నిర్మాణ పనుల్లో 35 వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని తెలిపారు. పనులను వేగవంతం చేసేందుకు ప్రతి నిర్మాణ సంస్థకు స్పష్టమైన టార్గెట్లు విధించామని పేర్కొన్నారు.ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సిటీ కోసం ల్యాండ్ పూలింగ్ చాలా వరకు పూర్తయిందని, డిసెంబర్ నాటికి రోడ్ నెట్‌వర్క్‌కు సంబంధించి సింగపూర్ మాస్టర్ ప్లాన్ సిద్ధమవుతుందని వెల్లడించారు.

# ఢిల్లీ నిరసనలపై కేంద్రం ఆంక్షలు.. సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దుపై సుప్రీంకోర్టు కీలకంగా స్పందించింది. ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను అధికారులు ఉల్లంఘించారంటూ దాఖలైన పిటిషన్‌పై ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టనుంది. నిరసనల సమయంలో ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని కోర్టు స్పష్టం చేసినప్పటికీ.. ఆంక్షలు కొనసాగించారన్నది పిటిషనర్ ఆరోపణ.జస్టిస్ జాయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వి.మోహనతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ కేసును విచారించనుంది. న్యాయవాది శైలేంద్ర మణి త్రిపాఠి దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో పాటు, నిరసనల సమయంలో పలువురిని నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ దాఖలైన మరో పిటిషన్‌నూ ధర్మాసనం పరిశీలించనుంది.

**నిరసనకారుల నిర్బంధంపైనా విచారణ**

ఢిల్లీలో శనివారం జరిగిన నిరసనల సందర్భంగా ప్రతిపక్ష నేతలను ముందస్తుగా నిర్బంధించడాన్ని సవాలు చేస్తూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ, సీనియర్ న్యాయవాది మేనకా గురుస్వామి హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. నలుగురు మాజీ ముఖ్యమంత్రులు సహా ప్రతిపక్ష నేతలను నిర్బంధించడంపై ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు.
శాంతియుతంగా నిరసన తెలిపే ప్రాథమిక హక్కును అణచివేయడానికి ముందస్తు నిర్బంధాన్ని ఉపయోగించకూడదని ఆమె వాదించారు. నిరసనకారులను రోడ్లపై నుంచి, ప్రతిపక్ష నేతలను వారి ఇళ్ల నుంచి పోలీసులు తీసుకెళ్లడంపైనా ప్రశ్నించారు.
ముగ్గురు ఉన్నతాధికారులపై చర్యలు కోరుతూ పిటిషన్ కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఢిల్లీ పోలీస్ కమిషనర్ అనురాగ్ కుమార్, ఢిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) ఛైర్‌పర్సన్ డి.థారాపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని త్రిపాఠి కోరారు. సుప్రీంకోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా పట్టించుకోలేదని ఆరోపించారు.
మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు కారణంగా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అయితే, ఈ ఆరోపణలపై కోర్టు ఇంకా ఎలాంటి తుది నిర్ణయం తీసుకోలేదు.

**అక్టోబర్ 9న సుప్రీంకోర్టు ఏమంది?**

ఢిల్లీలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టనున్న నేపథ్యంలో 57 మెట్రో స్టేషన్లను మూసివేయాలని ఢిల్లీ పోలీసులు సూచించారు. న్యూఢిల్లీ, హజ్రత్ నిజాముద్దీన్ రైల్వే స్టేషన్లకు వచ్చే మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లపైనా ఆంక్షలు విధించారు. ఆ తర్వాత డీఎంఆర్‌సీ మూసివేతల సంఖ్యను 45కి తగ్గించింది.
ఈ ఆంక్షలపై విచారణ సందర్భంగా ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయడం సరికాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. భద్రతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని సేవలను నియంత్రించవచ్చని, కానీ పూర్తిగా నిషేధించకూడదని స్పష్టం చేసింది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ముందుగానే ట్రాఫిక్ సూచనలు ఇవ్వాలని, శాంతియుత నిరసనలకు తగిన సౌకర్యాలున్న ప్రత్యామ్నాయ ప్రాంతాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించింది. ఆ ఆదేశాలు అమలయ్యాయా లేదా అన్నది ఆదివారం విచారణలో కీలకంగా మారనుంది.

# ఉత్తరాఖండ్‌లో వరుస భూకంపాలు..

ఉత్తరాఖండ్‌లో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. శనివారం ఒక్కరోజే రాష్ట్రంలో రెండుసార్లు భూమి కంపించింది. సాయంత్రం ఉత్తరకాశీ జిల్లాలో భూకంపం సంభవించగా, అంతకు కొన్ని గంటల ముందు బాగేశ్వర్ జిల్లాలో ప్రకంపనలు చోటుచేసుకున్నాయి. వరుస ఘటనలతో స్థానిక ప్రజలు ఆందోళన చెందుతున్నారు.నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ (ఎన్‌సీఎస్) వెల్లడించిన వివరాల ప్రకారం.. ఈరోజు రాత్రి 8:07 గంటల సమయంలో ఉత్తరకాశీ జిల్లాలో భూమి కంపించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.2గా నమోదైంది. భూమికి 11 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.అంతకుముందు మధ్యాహ్నం 3:40 గంటలకు బాగేశ్వర్ జిల్లాలో కూడా స్వల్ప ప్రకంపనలు వచ్చాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 2.8గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం 5 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు ఎన్‌సీఎస్ తెలిపింది.
ఈ రెండు భూకంపాల వల్ల ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరిగినట్లు ఇంతవరకు సమాచారం అందలేదు.
ఇటీవలి కాలంలో ఉత్తరాఖండ్‌లో భూకంపాలు తరచూ సంభవిస్తున్నాయి. అక్టోబర్ 6వ తేదీన చమోలీ జిల్లాలో 4.9 తీవ్రతతో భూకంపం రాగా, దాని ప్రభావం దేశ రాజధాని ఢిల్లీ, పరిసర ప్రాంతాలపై కూడా పడింది. తాజా ప్రకంపనలతో దేవభూమిలో మరోసారి భూకంపాల భయం నెలకొంది.

# 'ప్రభుత్వానికి భయం పట్టుకుంది'.. ఢిల్లీ అరెస్టులపై ప్రియాంకా గాంధీ ఫైర్

- మొదటి పేజి తరువాయి

దేశద్రోహానికి పాల్పడుతున్నట్లేనని వ్యాఖ్యానించారు.
ఢిల్లీలో సీజేపీ చేపట్టిన ఎస్ఐఆర్ (ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ) వ్యతిరేక నిరసనపై పోలీసులు ఆంక్షలు విధించారు. ఈ నేపథ్యంలో యువతను అదుపులోకి తీసుకోవడంపై ప్రియాంకా గాంధీ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో స్పందించారు. గతంలో 254 మంది ఎంపీలను ఇబ్బందులకు గురిచేసి, అక్రమంగా అదుపులోకి తీసుకున్నారని ఆరోపించారు. ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలకు చెందిన నిరసనకారులపైనా అదే విధంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.దేశ రాజధానిని దిగ్బంధించి, రైళ్లు, మెట్రో సేవలను అడ్డుకుని, ఇంటర్నెట్ సేవలను నిలిపివేసి, అడుగడుగునా తనిఖీలు చేపడుతున్నారని ప్రియాంక ఆరోపించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన హక్కును వినియోగించుకుంటున్న యువతపై దాడులు చేసి అదుపులోకి తీసుకుంటున్నారని విమర్శించారు. ఎన్నికల సంఘం సహకారంతో ఎన్నికల్లో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దేశంలో ప్రజాస్వామ్యం లేదని, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలో నియంతృత్వ పాలన సాగుతోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ కూడా ఈ ఘటనలపై స్పందించారు. ఢిల్లీని కోటలా మార్చేశారని, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను చూసి ప్రభుత్వం ఆందోళన చెందుతోందని అన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణం కల్పించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలని కోరారు. దాదాపు 14 కోట్ల మంది భారతీయుల ఓటు హక్కులు ఇప్పటికే తొలగించారని ఆరోపిస్తూ, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలగాలంటే ఈ ప్రక్రియను రద్దు చేయాలని పేర్కొన్నారు.

# ఢిల్లీలో ఉద్రిక్తత.. కేజ్రీవాల్, మమతా బెనర్జీ అదుపులోకి..

- మొదటి పేజి తరువాయి

నిరసనకారులను ఎక్కడికక్కడ అడ్డుకుని పోలీసులు అదుపులోకి తీసుకుంటున్నారు. దీంతో పోలీసులతో ఆందోళనకారులు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో కన్నాట్ ప్లేస్, ఆకాశవాణి భవన్ దగ్గర తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. జంతర్ మంతర్ ప్రాంతానికి వెళ్లకుండా అడ్డుకోవడంతో ఆగ్రహానికి గురైన నిరసనకారులు పోలీసులపైకి రాళ్లు రువ్వారు. ఈ దాడిలో ఇద్దరు పోలీస్ సిబ్బంది గాయపడ్డట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన పోలీసులు లాఠీచార్జ్ చేసి నిరసనకారులను చెదరగొట్టారు.
కన్నాట్ ప్లేస్, ఆకాశవాణి భవన్ దగ్గర పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకున్నారు. జంతర్ మంతర్ వెళ్లే అన్ని మార్గాలను క్లోజ్ చేసి పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. తీవ్ర నిర్బంధం ఉన్న నిరసనకారులు ధైర్యంగా రోడ్లపైకి వస్తున్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్న్?న్నారు. సీజేపీ నిరసన నేపథ్యంలో సెంట్రల్ ఢిల్లీలో ఇప్పటికే పోలీసులు కఠిన ఆంక్షలు అమలు చేశారు. ప్రజా రవాణా వ్యవస్థలను నిలిపివేయడంతో పాటు మొబైల్, ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. మరోవైపు జంతర్ మంతర్ దగ్గర బొద్దింక జనతా పార్టీ చేపట్టిన నిరసనలో పాల్గొంటారనే అనుమానంతో ఢిల్లీలోని లోధి ఎస్టేట్ వెలుపల ఆమ్ ఆద్మీ పార్టీ (ఏఏపీ) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయనతో పాటు ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ తదితరులను నిర్బంధించారు. టీఎంసీ అధినేత్రి, బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీని సైతం ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేశారు.

# గెస్ట్‌హౌస్‌పై కర్ణాటకకు టీటీడీ వార్నింగ్.. స్వాధీనం చేసుకుంటామని హెచ్చరిక

- మొదటి పేజి తరువాయి

ఆయన మీడియాతో మాట్లాడుతూ, తిరుమల కొండ, సప్తగిరులు మొత్తం శ్రీ వేంకటేశ్వర స్వామికే సొంతమని, ఇతరులకు కేటాయించే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని స్పష్టం చేశారు. గతంలో మైసూరు మహారాజుకు టీటీడీ 7.5 ఎకరాల స్థలాన్ని కేటాయించిందని, దానిపై కర్ణాటక ప్రభుత్వం గెస్ట్‌హౌస్ నిర్మించుకుందని గుర్తుచేశారు.ఇటీవల కర్ణాటక కేబినెట్ ఈ గెస్ట్‌హౌస్‌ను తమ రాష్ట్ర పర్యాటక శాఖకు అప్పగించాలని నిర్ణయించిందని, ఈ నిర్ణయం వెనుక ఓ కాంగ్రెస్ మాజీ కేంద్ర మంత్రి హస్తం ఉందని భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. త్వరలోనే వారికి నోటీసులు పంపుతామని, స్పందించకపోతే గెస్ట్‌హౌస్‌ను టీటీడీ ఆధీనంలోకి తీసుకుంటుందని తేల్చిచెప్పారు.

# ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?

- మొదటి పేజి తరువాయి

ఇంతకీ ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు.
శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అణచివేసేందుకు 50 వేల నుంచి 75 వేల మంది పోలీసు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించి సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేయడం అన్యాయమని అన్నారు. కేంద్రం తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు కూడా స్పందిస్తున్నాయని గుర్తుచేశారు.
ఇదే సమయంలో, తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ విజయం సాధించడంపై నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఎన్నికలను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రాజకీయ పోటీగా మార్చిన కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. అధికార అహంకారంతో కమ్యూనిస్టులను ఓడించాలని పిలుపునివ్వడం సరికాదన్నారు. ప్రజల ఉద్యమాలను అణచివేతతో ఆపలేరని, కేంద్రం తన తప్పులను సరిదిద్దుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

# కేఫ్‌లో రాహుల్ గాంధీ, సీఎం విజయ్ భేటీ.. తమిళ రాజకీయాల్లో హాట్ టాపిక్!

- మొదటి పేజి తరువాయి

విజయ్‌ను అక్టోబర్ 10, 2026న చెన్నైలో భేటీ అయ్యారు. తొలుత విజయ్ నివాసంలో సుమారు గంటపాటు సమావేశమైన ఇరువురు నేతలు, ఆ తర్వాత సమీపంలోని కేఫ్‌కు వెళ్లి కాఫీ తాగారు. ఈ భేటీ రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.విజయ్ నివాసంలో జరిగిన సమావేశంలో రాష్ట్ర, జాతీయ రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.సమావేశం అనంతరం ఇద్దరూ సమీపంలోని కేఫ్‌కు వెళ్లారు. అక్కడ కాపుచినో కాఫీ, తిరమిసు, కుకీలు తీసుకున్నట్లు పీటీఐ వార్తా కథనం పేర్కొంది. కాంగ్రెస్, టీవీకే కలిసి పనిచేస్తున్న క్రమంలో కూటమి ఉమ్మడి కనీస కార్యక్రమం, భవిష్యత్తు ఎన్నికల ప్రణాళికలపై చర్చించే అవకాశం ఉందని సమావేశానికి ముందు వార్తలు వచ్చాయి. అయితే చర్చించిన ప్రతి అంశంపై అధికారిక ఎటువంటి ప్రకటన వెలువడలేదు.చెన్నైలోని ఐలాండ్ గ్రౌండ్స్‌లో నిర్వహించిన 'ఛత్రోన్ కి గూంజ్' (మానవర్గళిన్ కురల్) విద్యార్థుల కార్యక్రమంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ తమిళనాడుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో మాట్లాడనున్నారు రాహుల్ . విజయ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రాహుల్ గాంధీతో జరిగిన ఈ భేటీ..కాంగ్రెస్, టీవీకే రాజకీయ సంబంధాలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

# విద్వేషాలు రెచ్చగొట్టడమే వైసీపీ పని

**-ఎన్నికలు, బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని చూసిందీ వాళ్లే**

**-స్థానిక ఎన్నికల్లో గొడ్డలి పార్టీకి బుద్ధి చెప్పండి -మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి**

**-ప్రజలకు పిలుపునిచ్చిన ఇంటూరి నాగేశ్వరరావు**

**-122 మందికి 58.36 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**





**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 10:**

కులాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడంతో పాట-ు మంచి పనులకు అడుగడుగునా అడ్డుపడుతున్న గొడ్డలిపార్టీకి స్థానిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయాలు అందించడంలో భాగంగా.... ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 45 వ విడత చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక టిడిపి కార్యాలయంలో శనివారం నిర్వహించారు. 122 మంది లబ్ధిదారులకు 58.36 లక్షల సహాయాలను ఎమ్మెల్యే అందించారు.గుడ్లూరు మండలంలో 41 మందికి 20,30,572 రూపాయలు, కందుకూరు అర్బన్ పరిధిలో 6 మందికి 3,38,659రూపాయలు, లింగసముద్రం మండలంలో 32 మందికి 14,86,088 రూపాయలు, ఉలవపాడు మండలంలో 37 మందికి 16,82,405 రూపాయలు, వలేటివారిపాలెం మండలంలో ముగ్గురికి 1,48,583 రూపాయలు,ఒకరికి ఎల్ ఓ సి ద్వారా 49,492 రూపాయల విలువైన చెక్కులను నాగేశ్వరరావు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇప్పటివరకు 1982 మందికి 15 కోట్ల రూపాయలు సహాయంగా అందించామని ఆయన తెలిపారు. వైసిపి పేటీఎం బ్యాచ్... కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతూ పోస్టులు పెట్టి పైశాచిక ఆనందం పొందుతోంది. జగన్ పాలనలో ప్రజల కోసం చేసిందేమీ లేదు. మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వానికి అడ్డుపడుతున్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఇస్తామంటే, వద్దని కోర్టుకు వెళ్లారు. స్థానిక ఎన్నికలు జరపొద్దని పిటీషన్లు వేశారు. ఎన్నికలు జరిగితే, నిధులు దండిగా వస్తాయి, మరింత అభివృద్ధి జరుగుతుందన్న అక్కసుతో వైసీపీ నేతలు ప్రవర్తిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో వారికి బుద్ధి చెప్పాలి. రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబు విపరీతంగా కష్టపడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ వైద్యసహాయాలు అందిస్తున్నారు. త్వరలో కొత్త పింఛన్లు, ఇళ్ల స్థలాలు అందించబోతున్నాం. ఈ రెండేళ్లలో మేము చేసిన అభివృద్ధి, సంక్షేమం మీ కళ్ల ముందు కనిపిస్తూనే ఉంది. గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి తేడా గమనించండి. కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తూ... స్థానిక ఎన్నికల్లో ఓటు వేయండి అని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, పూరిమిట్ల గురునాథం, జనిగర్ల నాగరాజు, ఏఎంసీ డైరెక్టర్లు కొత్తూరి వెంకట సుధాకర్, మాదాల వెంకటేశ్వర్లు, నెల్లూరు పార్లమెంట్ అధికార ప్రతినిధి చదలవాడ కొండయ్య, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బెజవాడ ప్రసాద్, నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు కల్లూరి శైలజ, ప్రొఫెషనల్ వింగ్ అధ్యక్షురాలు పువ్వాడి మౌనిక, క్లస్టర్ ఇన్చార్జులు చిత్తారి మల్లికార్జున, ఉమ్మనేని సుబ్బారావు, పట్టణ నాయకులు ముచ్చు వేణు, చుండూరి శ్రీను, పులి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# గిద్దలూరు మున్సిపల్ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ..

## మున్సిపాలిటీ గ్రేడ్ 2కు తొలి ఎన్నిక

## రిజర్వేషన్ ప్రకటనపైనే ఆశావహుల చూపు!

**గిద్దలూరు:పెన్ పవర్ అక్టోబర్ 10**

నూతనంగా ఏర్పడిన గిద్దలూరు మున్సిపాలిటీ గ్రేడ్ 2లో తొలి ఎన్నికలకు సంబంధించి రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఎన్నికల నోటిఫికేషన్, చైర్మన్ పదవికి రిజర్వేషన్ కేటాయింపుపై రాజకీయ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి రాజకీయా పార్టీలో ఉత్కంఠ గా ఉంది.వివిధ సామాజిక వర్గాలకు చెందిన ఆశావహులు తమ ప్రయత్నాలను కొనసాగిస్తున్నారు. తెలుగుదేశం పార్టీలో చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో ఓసీ సామాజిక వర్గంలోని రెడ్డి వర్గం నుంచి దప్పిలి కాశిరెడ్డి, పల్లె శ్రీనివాసరెడ్డి, కాపు సామాజిక వర్గం నుంచి కమతం శ్రీనివాసులు, పసుపులేటి శ్రీనివాసులు పేర్లు వినిపిస్తున్నాయి. బీసీ సామాజిక వర్గం నుంచి నంది శ్రీనివాసులు పేరు కూడా చర్చలో ఉంది. అయితే వీరి అభ్యర్థిత్వాలు, పార్టీ తుది నిర్ణయాలపై అధికారిక ప్రకటన చేయాల్సిఉండది ఈకేతగిరి లలో.అధిష్టానం కు పేర్లు పంపినట్లు తెలుసుంది. గిద్దలూరు లో మొత్తము 30, 633 ఓట్లు ఉండగా , ఇందులో బీసీ ఓటర్లు 16,369 మంది ఉన్నారు., ఓసీ ఓటర్లు 10,429 మంది, ఇతర సామాజిక వర్గాల ఓటర్లు 3,835 మంది ఉన్నారు. ఈ గణాంకాలు అధికారిక ఓటరు వివరాలతో ధ్రువీకరించాల్సి ఉంది. బీసీ ఓటర్ల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని చైర్మన్ పదవి బీసీ జనరల్‌కు కేటాయించవచ్చనే అభిప్రాయాలు స్థానికంగా వ్యక్తమవుతున్నాయి. అయితే ఇవి ప్రస్తుతానికి ఊహాగానాలు, చర్చలకే పరిమితమయ్యాయి. ఓటర్ల సంఖ్య ఆధారంగా మాత్రమే రిజర్వేషన్‌ను అంచనా వేయడం సాధ్యం కాదని కొందరు గతంలో నగర పంచాయితీ బీసీ కి కేటాయించగా , మున్సిపాలిటి గ్రేడ్ 2 గా మార్పు చెందిన తరు వాత. మళ్ళీ బి సి కి కేటాయించకూడదని ఏమి లేదని నిపుణులు అంటున్నారు. చైర్మన్ పదవికి సంబంధించిన రిజర్వేషన్‌ను ప్రభుత్వం నిర్ణీత నిబంధనలు, వర్తించే రొటేషన్ విధానం, అధికారిక కేటాయింపుల ప్రకారం ఖరారు చేయాల్సి ఉంటుంది. గిద్దలూరు మున్సిపాలిటీకి సంబంధించిన తుది రిజర్వేషన్ ఉత్తర్వులు వెలువడిన తర్వాతే బీసీ జనరల్, మహిళల రిజర్వేషన్ లేదా ఇతర కేటగిరీలపై స్పష్టత వస్తుందని అంటున్నారు. అప్పటివరకు ఏ సామాజిక వర్గానికి చైర్మన్ పదవి దక్కుతుందనే అంశంపై ముందస్తు నిర్ధారణకు రావడం సరికాదంటున్నారు అధికారిక ప్రకటన కోసం ఆశావహులు, రాజకీయ పార్టీలు ఎదురుచూస్తుండటంతో గిద్దలూరు మున్సిపాలిటీ తొలి ఎన్నికలపై ఆసక్తి నెలకొంది.

# శ్రీ కోటా సత్యమాంబ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు

**శ్రీ కోటా సత్యమాంబ దేవి ఆశీస్సులు దీవెనలు పొందండి.**

**11 నుండి 21 వరకు శరన్నవరాత్రులు.**

**పెన్ పవర్, కంభం అక్టోబర్ 10**



దసరా శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా కంభం పట్టణం నందు వెలసిన శ్రీ కోటా సత్యమాంబ దేవి మహిమలు సర్వజన విధితములు. మహాదేవి కరుణ కటాక్షం వలన భూత పేత పిశాచ బాధలు నిర్మూలమై సంతానహీనులవు కాంతులకు సంతానం కలుగుచున్నది. ఇలాంటి తల్లి మహిమ వలన ఎంతో మంది ఈ ప్రాంతం వారు అమ్మవారిని దర్శించుకోవడం సాంప్రదాయంగా వస్తుంది. ఈనెల 11 నుండి21 తేదీ వరకు శ్రీ కోట సత్యమాంబ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు జరుపటకు ఆలయ కమిటీ వారు నిర్ణయించారు. ప్రతిరోజు శ్రీ కోట సత్యమాంబా దేవి వివిధ అలంకారములతో పూజలు చేయుదురు. 11న శ్రీ కోటా సత్యమాంబ దేవి అలంకారము. 12 న శ్రీ అంబా భవాని దేవి 13న శ్రీ భువనేశ్వరి దేవి 14న శ్రీ గజలక్ష్మి దేవి 15న శ్రీ రాజరాజేశ్వరి దేవి 16 న శ్రీ సరస్వతి దేవి 17 న శ్రీ మీనాక్షి దేవి 18న శ్రీ మహిషాసుర మర్దిని దుర్గాష్టమి. 19న శ్రీ బాల హృదయేశ్వరి 20 న శ్రీ మోహిని దేవి 21న శ్రీ అన్నపూర్ణాదేవి. ప్రతిరోజు పలు దివ్య అలంకరణ ములతో శ్రీ కోట సత్యమాంబ దేవిని అలంకరిస్తారు. ఈ ప్రాంత భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని ఈ ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ వారు దేవాలయ ధర్మకర్త కె. రమణ స్వామి దేవాలయ అర్చకులు లక్ష్మీదేవి దేవి అలంకరణ అర్చకులు యన్నం శ్రీనివాసులు ఆవుల వెంగళరావు కోరారు. ప్రతిరోజు అన్నదాన కార్యక్రమం కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే నవరాత్రుల సందర్భంగా ప్రతిరోజు పలు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కావున ఈ ప్రాంత భక్తులు నిత్యం అమ్మవారిని దర్శించుకుని దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసిన

# ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్






**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 10**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల చదువును ప్రోత్సహించడానికి సైకిళ్లు అందిస్తున్నట్లు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్ రావు స్పష్టం చేశారు. శనివారం అమరావతి సేవా ట్రస్ట్ సహకారంతో ఒంగోలు నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే 1100 మంది విద్యార్థులకు మినీ స్టేడియంలో సైకిళ్లు అందజేశారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 6 నుండి 10 వ తరగతి వరకు 5600 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. ఇటీవల త్రోవగుంటలో 500 మంది విద్యార్థులకు సైకిళ్లు అందించినట్లు చెప్పారు. ప్రస్తుతం 1100 మందికి సైకిళ్లు ఇస్తున్నామని, మిగిలిన వారికి మూడు నెలలకు ఒకసారి సైకిళ్లు అందించనున్నట్లు చెప్పారు. కంపెనీలు తమ సి ఎస్ ఆర్ ఫండ్స్ తో ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం పట్ల దామచర్ల జనార్దన్ రావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంకు పర్సన్ ఇంచార్జి డాక్టర్ కామేపల్లి సీతారామయ్య, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రాచగొర్ల వెంకట్రావు, అమరావతి సేవా ట్రస్ట్ ప్రతినిధులు పావులూరి బాపయ్య, కంచర్ల వెంకటనారాయణ, మన్నం వేణుబాబు, అబ్బూరి నవీన్, గార్లపాటి శ్రీనివాసరావు, గుంటూరు హరి, గుంటూరు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# పాకల బీచ్‌లో గల్లంతైన వారి ఆచూకీ కోసం ముమ్మరంగా గాలింపు చర్యలు

**- జిల్లా ఎస్పీ వి హర్ష వర్ధన్ రాజు**

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 10**





సింగరాయకొండ మండలం పాకల బీచ్ లో శనివారం విషాదం చోటుచేసుకుంది. సముద్ర స్నానానికి వచ్చిన వారిలో ఇద్దరు యువకులు అలల ఉధృతికి మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతు అయ్యారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురుని స్థానిక మత్స్యకారులు, మెరైన్ పోలీసులు కాపాడారు. జిల్లా ఎస్పీ వి.హర్ష వర్ధన్ రాజు ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ సంఘటన ఒక దురదృష్టకరమని, విచారం వ్యక్తం చేశారు. కనిగిరి మండలం శ్రీరంగపురం గ్రామం నుండి సుమారు 70 మంది తమ ఆచారం ప్రకారం పోలేరమ్మ జాతర జరుపుకొని, సముద్ర స్నానం చేయడానికి పాకల బీచ్‌కు వచ్చారని అన్నారు. అక్కడ స్నానం చేస్తుండగా ఒక రిప్ కరెంటు పెద్ద అల వచ్చి కొందరిని లోపలికి లాక్కెళ్ళిందని, పరిస్థితిని గమనించిన స్థానిక మత్స్యకారులు, మెరైన్ పోలీసు వెంటనే స్పందించి బోట్ల ద్వారా కొంతమందిని రక్షించారన్నారు. ఈ ప్రమాదంలో పాలడుగు తేజ (20 ఏళ్లు), బత్తుల మహేష్ బాబు (22 ఏళ్లు ) మృతిచెందారని, దేవల విష్ణు(19 సం), దేవల నారాయణ (27 సం) ఆచూకీ లభ్యం కాలేదని తెలిపారు.మనోజ్ కుమార్, మహేష్ తేజ, నరసింహ చికిత్స పొందుతున్నారని, గల్లంతైన వారి ఆచూకీ కోసం పోలీసు యంత్రాంగం సంబంధిత శాఖల సమన్వయంతో డ్రోన్లు, పడవల సహాయంతో గాలింపు చర్యలను ముమ్మరం చేసినట్లు తెలిపారు. గల్లంతైన వారి ఆచూకీ గుర్తించేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు. సముద్రంలో స్నానాలు చేసే సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని, ప్రమాదకరమైన ప్రాంతాల్లోకి వెళ్లకూడదని హెచ్చరించారు. సముద్రంలోకి వెళ్లవద్దని పోలీసులు సూచించిన ప్రాంతాల్లో స్నానాలు చేయడం, లోతైన నీటిలోకి వెళ్లడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని స్పష్టం చేశారు. జిల్లా ఎస్పీ వెంట ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, సింగరాయకొండ సీఐ శ్రీహరి, మెరైన్ ఇన్స్పెక్టర్ శివన్నారాయణ, సింగరాయకొండ ఎస్సై సుధీర్ కుమార్, సిబ్బంది ఉన్నారు.

# వార్డుల పునర్విభజనలో అక్రమాలపై నిరసన

**-మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ నుంచి కమిషనర్‌ను తొలగించాలి**

**-సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు వైఎస్సార్‌సీపీ పిలుపు**




**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 10**

కందుకూరు మున్సిపాలిటీ వార్డుల పునర్విభజనలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ నుంచి కమిషనర్‌ను తొలగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ రఫీ డిమాండ్ చేశారు. వార్డుల పునర్విభజనలో అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం విడుదల చేసిన వార్డుల పునర్విభజన ముసాయిదాలో అనేక తప్పులు ఉన్నాయని, వార్డుల నైసర్గిక స్వరూపం, భౌగోళిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా విభజన చేపట్టారని ఆయన ఆరోపించారు. దీనివల్ల భవిష్యత్తులో ఆయా వార్డుల్లో అనేక సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాకుండా అధికార పార్టీకి ప్రయోజనం చేకూర్చేలా పునర్విభజన చేపట్టినట్లు ఆరోపించారు.

**అభ్యంతరాలను పట్టించుకోవడం లేదు**

వార్డుల సరిహద్దులపై అభ్యంతరాలు తెలియజేస్తూ వినతిపత్రాలు సమర్పించేందుకు ప్రయత్నించినా, మున్సిపల్ అధికారులు రాజకీయ పార్టీల అభిప్రాయాలను స్వీకరించడం లేదని షేక్ రఫీ విమర్శించారు. వార్డుల పునర్విభజన ముసాయిదా ప్రతులు, ఓటర్ల జాబితాలు కోరితే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు మాత్రమే ఇస్తామని, రాజకీయ పార్టీలకు ఇవ్వాలని ఆదేశాలు లేవని అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు.మున్సిపల్ చట్టంలోని నిబంధనలు, ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పులకు అనుగుణంగా వార్డుల పునర్విభజన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. గూగుల్ మ్యాప్ ద్వారా ప్రాంతాలను గుర్తించి, భౌగోళిక పరిస్థితులు, ప్రజల సౌకర్యాలు, అన్ని సామాజిక వర్గాల అవసరాలను పరిగణనలోకి తీసుకుని శాస్త్రీయ పద్ధతిలో వార్డులను పునర్విభజించాలని కోరారు. అవసరమైతే ఈ వ్యవహారంపై రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

**సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన**

వార్డుల పునర్విభజనలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలకు నిరసనగా, కందుకూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ ఆదేశాల మేరకు అక్టోబర్ 12వ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు షేక్ రఫీ వెల్లడించారు. పట్టణంలోని అన్ని వార్డుల ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఈ కార్యక్రమానికి హాజరై తమ వార్డుల సరిహద్దులపై ఉన్న అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యవాదులు, ఇతర రాజకీయ పార్టీల నాయకులు కూడా నిరసనకు సంఘీభావం తెలిపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మానవతావాదులారా..

# మహాధర్నాను విజయవంతం చేయండి

## – ఇస్లాంపేట మక్కా మసీదును సందర్శించిన ఎంఆర్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందా కృష్ణ మాదిగ





**ఒంగోలు టౌన్, పెన్ పవర్ అక్టోబర్ 10**

సింగరాయకొండ శ్రీ చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్ లో హత్యకు గురైన తౌషిక్, న్యాయం కోసం సుదీర్ఘ పోరాటం చేసి ఆత్మహత్య చేసుకున్న తౌషిక్ తల్లి మౌలాబి మరణాలకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్టు చేయాలని కటినమైన శిక్షలు వేయాలని కోచింగ్ సెంటర్ ను శాశ్వతంగా మూసివేయాలని బాధిత కుటుంబానికి సరైన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12వ తేదీ సోమవారం ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించ తలపెట్టిన మహాధర్నా ను ముస్లిం సమాజం అంతా తరలి రావాలని ఎం ఆర్ పి యస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఇస్లాం పేట ముస్లిం కమ్యూనిటీ హాలులో మహాధర్నా ప్రచార కరపత్రాలను ముస్లిం నాయకులు తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. ఆధిపత్య కులాలు ముస్లిం సమాజాన్ని ఒంటరి చేశాయని, ఏ సమస్య వచ్చిన ముస్లింలకు అండగా దళిత సమాజం, మిగిలిన ప్రజాసంఘాలు నిలబడుతాయని ముస్లింలను ఎప్పటికీ ఒంటరి కానీయమని దళిత ముస్లిం ఐక్య ఉద్యమాలు కొనసాగిస్తామని ముస్లిం పెద్దలకు ధైర్యం చెప్పారు, తౌషిక్ హత్యకు మౌలాబి ఆత్మహత్యకు కారణమైన వారికి శిక్షలు పడేవరకూ పోరాటం కొనసాగుతుందని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ పీఎస్ జిల్లా నాయకులతో పాటు ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ రఫీ, ముస్లిం నాయకులు పఠాన్ కరిముల్లా ఖాన్, సయ్యద్ ఇస్మాయిల్, షేక్ మహ్మద్ రఫీ,షేక్ అబ్దుల్ రషీద్, సయ్యద్ హుస్సేన్,షేక్ అబ్దుల్ రవూఫ్,పఠాన్ సర్దార్ ఖాన్, షేక్ సిలార్,షేక్ ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# తౌషిక్.. మౌలాబీ మరణాలతో నాకు సంబంధంలేదు

### – తౌషిక్ మరణంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి వాస్తవాలను నిగ్గు తేల్చాలి – మాగుంట వెల్లడి



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్ అక్టోబర్ 10**

శింగరాయకొండ గ్రామంలోని శ్రీ చైతన్య నవోదయ విద్యా సంస్థలో చదువుతున్న విద్యార్థి, తౌషిక్ ఇటీవల మృతిచెందడం జరిగింది. ఆ విద్యార్ధి మరణాన్ని ఆత్మహత్యగా చిత్రీకరించడంలో నా పాత్ర వుందని యం.ఆర్.పి.ఎస్. వ్యవస్తాపక అధ్యక్షుడు, మంద కృష్ణ మాదిగ మీడియా సమావేశాలలో చేస్తున్న ఆరోపణలలో ఎలాంటి వాస్తవం లేదని, శ్రీ చైతన్య నవోదయ విద్యా సంస్థతో నాకు ఎలాంటి సంబంధం లేదని ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆ స్కూల్ యాజమాన్యాన్ని కాపాడవలసిన అవసరం అంతకంటే తనకు లేదన్నారు. విద్యార్ధి మృతి కేసును తారుమారు చేయుటకు నేను ఎవరకీ శిఫార్సు చేయలేదని తెలిపారు. మా మాగుంట కుటుంబం గురించి ప్రకాశం జిల్లా ప్రజలందరికి తెలుసు అని మా అన్న స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి ఆశయాలను కొనసాగించేందుకే మా మాగుంట కుటుంబం రాజకీయాలలో ఉందని, ప్రజలకు సేవ చేయటమే మా మాగుంట కుటంబ లక్ష్యం అని పేర్కొన్నారు. ప్రజల ఆదరణ.. ఆశీస్సులతోనే మా కుటుంబం మూడు దశాబ్దాలకు పైగా జిల్లాలో రాజకీయం చేస్తూ, ప్రజలకు సేవలు చేస్తుందని పత్రికా ముఖంగా తెలియజేశారు. అసత్య ఆరోపణలు చేసే ముందు మా కుటుంబ నేపద్యం తెలుసుకొని మాట్లాడాలని, తౌషిక్ మరణంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి వాస్తవాలను నిగ్గుతేల్చాలని మాగుంట కుటుంబం కోరుతుందని తెలిపారు.

# దేవి శరన్నవరాత్రులకు ముస్తాబైన శ్రీ ఆనంద ఆశ్రమం



**దొనకొండ అక్టోబర్ 10 పెన్ పవర్**

మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీఆనంద ఆశ్రమంలో శ్రీ దేవి శరన్నవరాత్ర మహోత్సవములు ఘనంగా నిర్వహించనున్నట్టు ఆశ్రమ అర్చకులు శ్రీ మణి బాబు శర్మ తెలియజేశారు. శ్రీ పరాభవనామ సంవత్సర ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమి అనగాతే-11-10-2026- ఆదివారం నుండితే,20-10-2026- మంగళవారం వరకు భక్తజన ద్రవ్య సహాయంబున ప్రతి సంవత్సరం లాగే శ్రీ గోవిందమాంబ శ్రీ ఈశ్వరీ మహాదేవి అమ్మవార్లు రోజుకు ఒక అవతారంలో దర్శనం ఇవ్వనున్నారు ప్రతిరోజు ఉదయం 7 గంటల నుండి మహన్యాస పూర్వక గణపతి పూజ మండపారాధన పుణ్య వచనము కలసపూజ అమ్మవారికి విశేష అభిషేకములు ప్రత్యేక అలంకరణలు అమ్మవారి అష్టోత్తర శతనామావళి సామూహిక కుంకుమ పూజలు మహా నైవేద్యములు సామూహిక మంగళహారతులు ప్రసాద వినియోగం ఘనంగా నిర్వహించును కనుక భక్తులెల్లరు విచ్చేసి పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు అల్పాహారం స్వీకరించి అమ్మవారి దివ్య అనుగ్రహానికి పాత్రులు కాగలరని శ్రీ భైరవానంద స్వామి తెలియజేశారు.

# చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి

**దొనకొండ అక్టోబర్ 10 పెన్ పవర్**

మండల కేంద్రంలోని స్థానిక శ్రీ గౌతమి డిగ్రీ కళాశాల విద్యార్థులకు దసరా సందర్భంగా శనివారం కళాశాల పిడి వెంకటేశ్వర రెడ్డి క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. కళాశాలలో చదువుతున్న విద్యార్థులు రెండు జట్లుగా ఏర్పడి క్రికెట్ మ్యాచ్ ఆడారు. సంగీత్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 72 రన్స్ చేశారు, తదుపరి బరిలో దిగిన అఖిల్ జట్టు 9 ఓవర్లకు 48 రన్స్ కి ఆల్ అవుట్ అయ్యారు. సంగీత్ జట్టు విన్నర్స్ గా అఖిల్ జట్టు రన్నర్స్ గా నిలిచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఎఫ్రాయిమ్ మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని విద్యార్థులకు తెలిపారు. గెలుపొందిన జట్టును అభినందించి విజేతలకు ట్రోఫీ అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు కళాశాల సిబ్బంది. పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరూ ఆరోగ్య బీమా పొందాలి

### ఆరోగ్య బీమాతో నగదు రహిత వైద్యం.. ఆర్థిక భారం లేకుండా మెరుగైన చికిత్స

### 42 ఆరోగ్య బీమా సంస్థల కార్డులతో శకుంతల ఆస్పత్రిలో వైద్య సేవలు – డాక్టర్ ఐలా శ్రీనివాసరావు




**సంతమాగులూరు పెన్ పవర్, అక్టోబర్ 10**

అనారోగ్య సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఆరోగ్య బీమా పొందాలని శకుంతల న్యూరో కేర్ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ ఐలా శ్రీనివాసరావు సూచించారు. ఆరోగ్య బీమా ఉంటే పాలసీ నిబంధనలు, అర్హతలకు అనుగుణంగా నగదు రహిత వైద్య సేవలు పొందవచ్చని తెలిపారు. నరసరావుపేటలోని తమ ఆస్పత్రిలో 42 ఆరోగ్య బీమా సంస్థలకు చెందిన కార్డుల ద్వారా నగదు రహిత వైద్య సేవలు అందిస్తున్నట్లు వెల్లడించారు. ప్రస్తుత జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పర్యావరణ పరిస్థితుల కారణంగా అనేక మంది వివిధ అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని డాక్టర్ ఐలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్య నియమాలు పాటించడంతో పాటు వైద్య ఖర్చులను ఎదుర్కొనేందుకు ముందస్తు ఆర్థిక భద్రతగా ఆరోగ్య బీమా కలిగి ఉండటం అవసరమని చెప్పారు. చిన్నపాటి వైద్య సేవల నుంచి అత్యున్నత శస్త్రచికిత్సల వరకు తమ ఆస్పత్రిలో చికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు. ఫిరంగిపురం మండలం నుదురుపాడు గ్రామానికి చెందిన 52 ఏళ్ల మహిళ గర్భాశయంలో సుమారు 3 కిలోల బరువున్న ఫైబ్రాయిడ్ గడ్డను తొలగించేందుకు శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆయన తెలిపారు. సదరు మహిళకు ఆరోగ్య బీమా ఉండటంతో బీమా నిబంధనలకు అనుగుణంగా నగదు రహిత విధానంలో శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. దీంతో ఆమె కుటుంబంపై వైద్య ఖర్చుల భారం పడకుండా చికిత్స అందించగలిగామని పేర్కొన్నారు. అనారోగ్యం ఎప్పుడు ఎదురవుతుందో ముందుగా చెప్పలేమని, వైద్య ఖర్చులు కుటుంబ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ ఆరోగ్య బీమా కలిగి ఉండటం అవసరమని డాక్టర్ ఐలా శ్రీనివాసరావు స్పష్టం చేశారు. పాలసీ పరిధి, మినహాయింపులు, నగదు రహిత చికిత్సకు సంబంధించిన నిబంధనలను తెలుసుకుని తమ అవసరాలకు తగిన ఆరోగ్య బీమాను ఎంపిక చేసుకోవాలని సూచించారు.

# ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ను సస్పెండ్ చేయాలి

### సిఐటియు డిమాండ్



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 10**

సిఐటియు ఆధ్వర్యంలో చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ ఐ ఆర్ ను రద్దు చేయాలని, డిమాండ్ చేస్తూ ప్లకార్డులతో గిద్దలూరు లోని పొట్టి శ్రీరాములు విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు టి ఆవులయ్య మాట్లాడుతూ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, బిజెపి ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేస్తున్నారని, చిన్న చిన్న పొరపాట్లు చూపించి దేశంలో ఏకంగా 13 కోట్ల ఓట్లను తొలగించారని, అర్హులైన వారికి తొలగించిన ఓట్లను వెంటనే ఓటర్లుగా చేర్చాలని, ప్రజాస్వామ్యాన్ని, ఓటు హక్కును కాపాడాలని, సర్ ను నిలిపివేయాలని, ఈ సందర్భంగా డిమాండ్ చేశారు . ఎన్నికల కమిషనర్ స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన వ్యవస్థగా ఉండాలని అధికార పార్టీ అండగా ఉండకూడదన్నారు. ఎన్నికల కమిషనర్ సమావేశంలో 10 నెలల కాలంలో 14 సార్లు సమావేశం నిర్వహించగా ఒకే రోజు నాలుగు సార్లు అభ్యంతరాలు తెలిపినా కూడా ఫారం 6 లో లోపాలను సరిచేయకుండా ఏకపక్షంగా వ్యవహరించడం కేంద్రంలో బిజెపి పార్టీ అధికారానికి అనుగుణంగా పనిచేశారని రుజువుతుందన్నారు. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసేంతవరకు పోరాటం కొనసాగుతూనే ఉంటుందన్నారు .ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు గిద్దలూరు మండల కన్వీనర్ బి నర్సింహులు నాయకులు డి శ్రీనివాసులు గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం నాయకులు బి పూర్ణ ముఠా కార్మిక సంఘం నాయకులు పి శ్రీను ఎన్ వీరయ్య చందు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి

### – కలెక్టరేట్ ఎదుట వామపక్షాల ధర్నా – అప్రకటిత ఎమర్జెన్సీని తిప్పికొట్టాలని పిలుపు

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 10**

ఎస్ఐఆర్ పేరుతో అర్హులైన పౌరుల ఓటు హక్కును హరించే కుట్రలను తిప్పికొట్టాలని, ఎన్నికల ప్రజాస్వామ్య పరిరక్షణలో విఫలమైన ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీని తలపించే నిర్బంధ పాలన సాగుతోందని విమర్శించారు. ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు వామపక్షాలు, ప్రజాసంఘాలు ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. వామపక్ష పార్టీల రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట సీపీఎం, సీపీఐ, సిపిఐ (ఎంఎల్), సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీపీఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, సీపీఐ నగర సమితి కార్యదర్శి శ్రీరామ్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో సీపీఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి ఎస్కె మాబు మాట్లాడుతూ.. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, ప్రజల రాజ్యాంగ హక్కులను అణచివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో ఓటర్ల జాబితా నుంచి పెద్ద సంఖ్యలో పేర్లను తొలగించడం వెనుక ఉన్న ఉద్దేశాలను ప్రజలు ప్రశ్నించాలని కోరారు. సాధారణంగా ప్రతి సంవత్సరం మరణించిన వారి పేర్లను తొలగించడం, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడం వంటి ప్రక్రియలు జరుగుతాయని, అయితే ఒకేసారి భారీ సంఖ్యలో ఓటర్లను తొలగించడం, మరి కొంతమందికి నోటీసులు జారీ చేయడం అనేక సందేహాలకు తావిస్తోందన్నారు. అర్హులైన ఓటర్లు తమ హక్కును నిరూపించుకోవాల్సిన పరిస్థితిని సృష్టించడం ఆందోళనకరమని పేర్కొన్నారు. దేశ రాజధాని ఢిల్లీలో నిరసనలను అడ్డుకునేందుకు భారీగా భద్రతా బలగాలను మోహరించడం, రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగించడం, రైల్వే స్టేషన్లను మూసివేయడం వంటి చర్యలు అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తున్నాయని మాబు విమర్శించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ.. ఓటు హక్కు ప్రభుత్వాలు ఇచ్చే భిక్ష కాదని, రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కు అని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో అర్హులైన ఒక్క



ఓటరు కూడా హక్కును కోల్పోకుండా ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తొలగించిన పేర్లను పునఃపరిశీలించి, అర్హులకు తిరిగి అవకాశం కల్పించాలని కోరారు. సీపీఐ(ఎంఎల్) నాయకురాలు ఎస్.లలితకుమారి మాట్లాడుతూ.. పాత పత్రాలు, పూర్వీకుల రికార్డులు లేని కారణంగా పేద ప్రజలను ఓటు హక్కుకు దూరం చేయడం అన్యాయమన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో పారదర్శకత పాటించి, ప్రజల్లో నెలకొన్న సందేహాలను ఎన్నికల సంఘం నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి సీహెచ్‌వీ సాగర్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించేలా ఎన్నికల సంఘం వ్యవహరించాలని కోరారు. పార్టీ సీనియర్ నాయకులు ఏ వి పుల్లారావు,సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.రమేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ నాయకులు పేరయ్య, తదితరులు మాట్లాడారు. కార్యక్రమం లో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.రఘురామ్, వి.బాలకోటయ్య, కె.రమాదేవి, పి.కల్పన, జి శ్రీనివాసరావు, రైతుకూలీ సంఘం నాయకులు ఆర్.మోహన్, ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు జి.శేషయ్య, పలు ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాలకొండ లో మహిళ శవం లభ్యం

**వలేటివారిపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 10**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో కొండపైకి వెళ్ళే నడక మార్గం వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. శనివారం ఉదయం 8 గంటల సమయంలో స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ ప్రేమ్ కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వద్ద ఉన్న ఓటరు కార్డు ఆధారంగా ఆమె జమ్మలమడుగుకు చెందిన చౌడం కామాక్షి (55), భర్త నరసింహుడు గా గుర్తించారు. మృతురాలి బంధువులకు సమాచారం అందించామని, వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని పోలీసులు తెలిపారు.



# కొమరోలు లోని ఎస్ బి ఎన్ ఆర్ ఎం పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు

### సాంప్రదాయ దుస్తులలో హాజరైన విద్యార్థులు -అలరించిన అమ్మవారి వేషధారణలో విద్యార్థులు చేసిన నృత్యాలు,నాటికలు

### దసరా ప్రాముఖ్యత ప్రాచీన గాథలను వివరించిన కరస్పాండెంట్ బందుల నారాయణమ్మ, హెచ్ఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ వై రేవతి







**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 9**

కొమరోలు లోని ఎస్బిఎన్ఆర్ఎం పాఠశాలలో శుక్రవారం దసరా నవరాత్రుల ముందస్తు వేడుకలు అత్యంత వైభవంగా, ఆనందోత్సవాలతో చిన్నారుల కేరింతలతో, ఘనంగా నిర్వహించారు. ఆ సందర్భాన్ని పురస్కరించుకొని ఆ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సాంప్రదాయ దుస్తులను పాఠశాలకు హాజరయ్యారు.దీనితో పాఠశాల తరగతి గదులు, పాఠశాల ప్రాంగణం కొత్త అందాన్ని సంతరించుకున్నాయి. వేదికపై విద్యార్థినీ విద్యార్థులు వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అలంకరణలో దర్శనమిస్తూ చేసిన నృత్యాలు, నాటికలు అలరించాయి. విద్యార్థినీ విద్యార్థులు నిర్వహించిన నాటికలలో ముఖ్యంగా మహిషాసుర మర్దిని నాటిక మరింత ఆకట్టుకొని ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసింది. వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భువి నుంచి దివికి దిగి వచ్చిందా?అన్నట్లుగా విద్యార్థుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బందుగుల సుబ్బారెడ్డి అధ్యక్షత వహించగా, ఎస్ బి ఎన్ ఆర్ ఎం విద్యాసంస్థల కరస్పాండెంట్ బందుగుల నారాయణమ్మ, ప్రిన్సిపాల్ వై రేవతి, ఎస్ ఎల్ వి సొసైటీ వైస్ ప్రెసిడెంట్ బందుగుల వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా వారు వాసవి కన్యకా పరమేశ్వరి దేవి చిత్రపటానికి పూలమాలవేసి, ఏర్పాటుచేసిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ నారాయణమ్మ మాట్లాడుతూ కన్యకా పరమేశ్వరి దేవి కరుణాకటాక్షాలు పాఠశాలపై,విద్యార్థిని విద్యార్థులు,వారి తల్లిదండ్రులపై ఉపాధ్యాయులపై పాఠశాల యాజమాన్యం పై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి మాట్లాడుతూ, కులమతాలకతీతంగా పాఠశాలలో అన్ని పండుగల ముందస్తు వేడుకలను ఘనంగా జరుపుకోవడం, విద్యార్థులకు పర్వదినాల ప్రాముఖ్యత వివరించటం పాఠశాల ప్రారంభం నుండి గత దశాబ్దాల కాలంగా సాంప్రదాయంగా జరుగుతున్నదని తెలిపారు. ప్రిన్సిపాల్ రేవతి మాట్లాడుతూ నేటి చిన్నారులకు ప్రాచీన పౌరాణిక గాథలు, పర్వదినాల ప్రాముఖ్యత తెలియవని, పూర్వం కుటుంబాలలో ఉంటున్న అవ్వ తాతలు తమ మనుమళ్లు మనవరాళ్లకు పౌరాణిక గాథల గురించి, నాటి దేవతలు వారు సమాజానికి అందించిన, సందేశాలు, సూక్తుల గురించి వివరించే వారిని, అంతే గ్రామీణ ప్రాంతాలలో హరికథలు బుర్రకథలు నాటకాల ప్రదర్శన తదితరవాటిని నిర్వహించి పండుగల ప్రాముఖ్యత వివరించేవారని ఆమె తెలిపారు. అయితే మారుతున్న కాలానుగుణంగా ప్రాచీన గాథల ప్రాముఖ్యత ను వివరించే సంఘటనలుతగ్గిపోతున్నాయని అన్నారు . అందువల్ల తాము తమ పాఠశాలలో కులమతాలకు అతీతంగా ముందస్తుగా ప్రతి పండుగలను, జాతీయ పండుగల వేడుకలను నిర్వహించి, విద్యార్థులకు పండుగల ప్రాముఖ్యత గురించి, అందుకు సంబంధించిన పౌరాణిక గాథల గురించి వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. పాఠశాల విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పాఠశాల యాజమాన్యం ముందస్తు దసరా శుభాకాంక్షలు తెలియజేస్తూ సాంప్రదాయ దుస్తులలో పాఠశాలకు హాజరై అమ్మవారి వేషధారణలో నాటికలలో నటించి,నృత్యాలు చేసి అలరించిన విద్యార్థినీ విద్యార్థులను వారు అభినందించారు. ఆ కార్యక్రమంలో ఆ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు,విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.

## అంజమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించిన డాక్టర్ అశోక్ కుమార్






**సంతమాగులూరు, పెన్ పవర్, అక్టోబర్ 10**

సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామానికి చెందిన పావులూరి వెంకట శివన్నారాయణ మాతృమూర్తి పావులూరి అంజమ్మ భౌతికకాయానికి అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ నివాళులర్పించారు. అనంతరం అంజమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంతమాగులూరు మండల పార్టీ కన్వీనర్ దీపికల సుబ్బారావు, ఉపాధ్యక్షుడు దేవరపల్లి లక్ష్మారెడ్డి, పావులూరి వెంకటేశ్వర్లు, బండి కోటిరెడ్డి, పిల్లి రామిరెడ్డి, నంబల కోటేశ్వరరావు తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డికి వేద మంత్రోచ్చారణలతో దేవస్థానాల అర్చకులు, అధికారులు ఆశీర్వచనం



**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 10**

గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి దేవస్థానం, శ్రీ పాతాళ నాగేశ్వర స్వామి దేవస్థానాల కార్యనిర్వహణ అధికారులు నరసింహులు, చిక్కుడు శ్రీనివాసులు, చైర్మన్ సిద్ధం నరసింహులు, దేవస్థాన సిబ్బంది, కమిటీ సభ్యులు, అర్చకులు కలిసి ఎమ్మెల్యేకు వేద మంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారి తీర్థప్రసాదాలను అందించి, ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. స్వామివారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, ప్రజాసేవలో మరింత ముందుకు సాగాలని కోరారు.

## కమనీయంగా నెమలిగుండ్ల రంగడి కళ్యాణం

### భారీగా తరలి వచ్చిన భక్తులు

### భక్తులకు అన్ని వసతులు కల్పించిన పాలక మండలి





**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 10**

జిల్లా రాచర్ల మండలం జేపీ చెరువు గ్రామ సమీపంలో సుందర సౌదర్యాల నలమల్ల ప్రకృతి ఒడిలో గుండ్లకమ్మ నది ఒడ్డున వెలసి ఈ ప్రాంత వాసుల ఇలావేల్పు నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి దేవస్థానం మాస కళ్యాణం కమణీయంగా అంగరంగ వైభవంగా నిర్వహించారు. శనివారం ఉదయం 5 గంటలకు స్వామివారికి అభిషేకం నిర్వహించి, అలంకారం అనంతరం భక్తుల దర్శనార్థం ఏర్పాటు చేశారు. 10 గంటలకు స్వామివారి శాంతి కళ్యాణం కమణీయంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆగమ శాస్త్రం ప్రకారం ఆలయ అర్చకులు స్వామివారికి కళ్యాణం చేశారు. స్వామి వారికి ఇరువురు దేవేరులకు కళ్యాణం తంతు కమణీయంగా నిర్వహించారు వేసవి శలవులు కావటంతో భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు . ఒక్క శనివారం తెరిచే ఆలయం కాటంతో భక్తుల సందడి పెరిగింది. అనంతరం భక్తులందరికీ ఆశీర్వచనం తీర్థప్రసాదములు అందజేయడం జరిగింది హైదరాబాద్ ఇంటెలిజెన్సీ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు,ఆలయ చైర్మన్ సిద్ధం నరసింహులు ఈ ఓ నాగయ్యలు ఆయనకు స్వాగతం పలికారు .

## అక్కలరెడ్డిపల్లె ఆలయంలో చోరీ: హుండి, మైకు మాయం

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 10**

గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె పంచాయతీ అక్కలరెడ్డిపల్లె గ్రామ శివారుల్లో ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో చోరీ జరిగింది. గుర్తుతెలియని దొంగలు ఆలయంలోకి ప్రవేశించి హుండిని పగులగొట్టారు. హుండిలోని నగదుతో పాటు మైకు సెట్టును కూడా అపహరించారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## తౌశిక్,మౌలాబి, కుటుంబాలకు న్యాయం చేయాలి

### రేపు ఒంగోలు కలెక్టరేట్ ముందు జరగబోయే మహాధర్నను జయంప్రదం చేయాలని కరపత్రాల విడుదల

### కొమరోలులోని జామియా మసీదులో జమాయత్ తో కలిసి కరపత్రాల ఆవిష్కరణ

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 10**

తౌశిక్,హత్య తల్లి మౌలాబి మరణానికి కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ మరియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం 12వ తారీఖున ఉదయం 10 గంటలకు ఒంగోలు కలెక్టరేట్ ముందు చేపట్టనున్న మహాధర్నా కరపత్రికలను శనివారం కొమరోలు మండలం కొమరోలు లోని జామియా మసీదు ఆవరణలో ఆవిష్కరించారు. ఆ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఇన్చార్జీలు శివయ్య మాదిగ,రెడ్డిపోగు భాస్కర్ మాదిగ, ముస్లిం మత పెద్ద ఖాసిం, తదితరులు మాట్లాడుతూ, సింగరాయకొండ లోని చైతన్య నవోదయ కోచింగ్ సెంటర్ కు సంబంధించిన ఈ ఘటనలో బాధ్యులైన యాజమాన్యాన్ని అరెస్టు చేసి ఆ స్కూలు గుర్తింపును వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.సదరు డిమాండు తో నిర్వహించనున్న మహాధర్నాలో లిఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ పాల్గొంటారని తెలిపారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సదరు ధర్నాకు కొమరోలు మండలం నుంచి ఎస్సీ, ఎస్టీ బిసి మైనారిటీ వామపక్షాల నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొని



జయప్రదం చేయాలని వారు కోరారు ఆ కార్యక్రమంలో ,షబ్బీళ్ళ,ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గుంటూరు సంజీవయ్య మాదిగ,ఎమ్మార్పీఎస్ నాయకులు సింగరాయి మాదిగ, ఖాసిం వలి, దివాన్ భాష, ఇస్మాయిల్, మహబూబ్ బాషా, మౌజన్ మోదిన్ సాహెబ్, తదితర ముస్లిం పెద్దలు, చంద్రమోహన్ మాదిగ,నిమ్మల రమణ మాదిగ,మాబు మరియు తదితరులు పాల్గొన్నారు.

# యర్రగొండపాలెం మేజర్ పంచాయతీ సర్పంచ్ పీఠం దళితులకు దక్కేనా

### దశాబ్దాలుగా రొటేషన్ విధానంలో అన్యాయం జరుగుతోందంటూ దళిత నాయకులు చేదూరి సుబ్బు ఆవేదన

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 10**



యర్రగొండపాలెం నియోజకవర్గం అసెంబ్లీ స్థానం ఎస్సీ రిజర్వ్డ్‌గా కొనసాగుతున్నప్పటికీ, యర్రగొండపాలెం పంచాయితీ ఏర్పాటైన నాటి నుంచి మండల కేంద్రమైన యర్రగొండపాలెం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానం మాత్రం నేటికీ ఎస్సీ వర్గానికి కేటాయించకపోవడంపై దళిత నాయకులు చేదూరి సుబ్బు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసారు. పంచాయతీ ఏర్పాటైన దశాబ్దాల కాలంలో ఎన్నో ఎన్నికలు జరిగినప్పటికీ, రొటేషన్ పద్ధతిలో సైతం ఒక్కసారి కూడా సర్పంచ్ పీఠం ఎస్సీలకు రిజర్వ్ కాకపోవడం విచారకరమని ఆయన ఆవేదన చేసారు . జనాభా ప్రాతిపదికన చట్టబద్ధమైన రొటేషన్ ప్రకారం పరిశీలిస్తే యర్రగొండపాలెం మేజర్ పంచాయతీలో ఎస్సీ సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం దక్కాల్సి ఉండగా, అధికారుల గణాంకాల లెక్కలు,రాజకీయ సమీకరణాల వల్ల ఈ స్థానం ఇతర వర్గాలకే పరిమితమవుతోందని విమర్శించారు. నియోజకవర్గ స్థాయిలో ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం ఉన్నా స్థానిక మేజర్ పంచాయతీ పాలనలో ఎస్సీలకు అవకాశం రాకపోవడం సామాజిక న్యాయానికి విరుద్ధమని స్పష్టం చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారులు స్పందించి, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో యర్రగొండపాలెం మేజర్ పంచాయతీ సర్పంచ్ పదవిని ఎస్సీ వర్గానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రాజ్యాధికారానికి హక్కు దారులుఉంటు ఓటు బలం ఉన్న దళితులకు పంచాయితీ సర్పంచ్ పీఠం దక్కక పోవడంలో కుట్ర రచన జరుగుతుందని విమర్శలు గుప్పించారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరుగ బోతున్న నేపథ్యంలో యర్రగొండపాలెం పట్టణంలో ఓట్ల శాతం అధికంగా ఉన్న దళితుల డిమాండును పరిశీలించి యర్రగొండపాలెం మేజర్ పంచాయితీని యస్సి రిజర్వ్ చేయాలని, లేకుంటే తమ ఓటు బ్యాంకు బలం చూపిస్తామని అన్నారు.

# కనిగిరి జెడ్పీటీసీ రేసులో మూలే

**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్ అక్టోబర్ 10**

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కనిగిరి మండల రాజకీయాలు వేడెక్కాయి. కనిగిరి జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేయడానికి పార్టీ సీనియర్ నేత, జిల్లా కార్యదర్శి మూలే గోపాల్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. **పార్టీకి నమ్మకమైన సైనికుడు:** వైఎస్సార్సీపీ ఆవిర్భావం నుండి పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న నేతగా మూలే గోపాల్ రెడ్డికి గుర్తింపు ఉంది. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటూ కార్యకర్తల్లో ఉత్సాహం నింపుతున్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, పార్లమెంటరీ ఇన్చార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదేశాలను తూ .చా.తప్పకుండా పాటిస్తూ నమ్మకమైన నాయకుడిగా ఎదిగారు. కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ కు అత్యంత సన్నిహితుడు కావడం, నియోజకవర్గ రాజకీయాలపై పట్టు ఉండటం ఆయనకు కలిసొచ్చే అంశం. 2024 ఎన్నికల్లో పార్టీ ఓటమి తర్వాత కూడా కార్యకర్తలకు అండగా నిలిచారు.

**ప్రజల్లో ప్రత్యేక గుర్తింపు:**

రాజకీయాలకే పరిమితం కాకుండా కనిగిరి మండల ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు. దీంతో కనిగిరి జెడ్పీటీసీ అభ్యర్థిగా తమ నేతకే అవకాశం కల్పించాలని ఆయన అనుచరులు, అభిమానులు కోరుకుంటున్నారు.

## ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాలకు కవులు రచయితల సంఘీభావ ప్రకటన అభినందనీయం

### – కథా రచయిత మంచికంటి వెంకటేశ్వర రెడ్డి

### – ఉద్యమ సంఘీభావ పుస్తకాల ఆవిష్కరణ కవితా గోష్ఠి



**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 10**

మరో గ్రంథాలయ ఉద్యమం ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దేశవ్యాప్తంగా జరుగుతున్న అనేక ఉద్యమాలకు దేశంలోని అనేకమంది కవులు అక్షర రూపంలో సంఘీభావాన్ని ప్రకటించారు. ఆ కవి కవితలను నహీ చలేంగే కవితా సంకలనంగా మంచికంటి రచించిన దీర్ఘ కవిత హం దేఖేంగే పుస్తకాలు డాక్టర్ కొర్రపాటి సుధాకర్ ఆవిష్కరించి యువత సామాజిక అభివృద్ధి కోసం పాటుపడటం చాలా ఆనందమని ఇది గొప్ప పరిణామమని తెలియజేశారు. కాంతి నల్లూరి, బారహమతుల్లా, డాక్టర్ నూకతోటి రవికుమార్, కత్తి కళ్యాణ్, మంచి కంటి తమ కవితలను గానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా గ్రంథాలయ ఉద్యమకారుడు మంచి కంటి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం ప్రజల కోసం పనిచేయనప్పుడు కవులు కళాకారులు సాహిత్య వేత్తలు తమ రచనలతో సమాజాన్ని జాగృతం చేయడానికి ముందుకు వస్తారు. అలా మరో గ్రంథా లయ ఉద్యమకారులు కవులు రచయితలు ఎంతోమంది ప్రజా ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంఘీ భావంగా కమ్యూనిస్టు నాయకులు మాబు, లలిత కుమారి, కళల దండోరా అంగలకుర్తి ప్రసాద్, ఏఐ డీఎస్ పి అధ్యక్షులు వెంకట స్వామి, జై భీమ్ నాగేశ్వరరావు, లక్ష్మీ నారాయణ, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ పేరయ్య, బీసీ సమన్వయ కమిటీ బొట్ల సుబ్బారావు, ఎమ్మార్పీఎస్ ఆనంద్ గిరిజన రాష్ట్ర అధ్యక్షుడు ధారా సత్యం, కొణిజేడు డెవలప్మెంట్ సొసైటీ నాగిరెడ్డి, జన విజ్ఞాన వేదిక మన్నం త్రిమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఓ పి డి ఆర్ రాష్ట్ర అధ్యక్షులు చావలి సుధాకర్ రావు కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

# మానసిక సమస్యలతో బాధపడే వారిని ప్రేమతో ఆదరించాలి

### న్యాయవాది షేక్ సంధాని

### ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఉమా మనోవికాస్ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 10**

ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రకాశం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈరోజు ఒంగోలు పట్టణంలోని ఉమా మనోవికాస్ కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాది షేక్ సంధాని పాల్గొని, కేంద్రంలోని మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారిని ఉద్దేశించి ప్రసంగించారు. మానసిక ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, మానసిక సమస్యలతో బాధపడుతున్న వారిని ప్రేమతో, ఆప్యాయతతో ఆదరించాలని, వారికి సమాజంలో గౌరవప్రదమైన జీవనం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి అందుబాటులో ఉన్న హక్కులు, ఉచిత న్యాయ సహాయం, న్యాయ సేవల గురించి అవగాహన కలిగి ఉండాలని వివరించారు. ప్రతి ఒక్కరికీ న్యాయం అందించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమా మనోవికాస్ కేంద్రం నిర్వాహకులు ఈశ్వర్, సంస్థ అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా సినీ కమెడియన్ అలీ 59వ జన్మదిన వేడుకలు

### అక్బర్ అలీ ఆధ్వర్యంలో పేదలకు చీరల పంపిణీ





**తర్లుపాడు పెన్ పవర్ అక్టోబర్ 10**

తెలుగు సినీ పరిశ్రమలో తనదైన కామెడీతో, నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న ప్రముఖ సినీ హీరో, కమెడియన్ అలీ 59వ జన్మదిన వేడుకలు మార్కాపురం జిల్లా తర్లుపాడు మండలంలో ఘనంగా జరిగాయి.తర్లుపాడు మాజీ ఎంపీటీసీ, మాజీ కో–ఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ అధ్యక్షతన ఈ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. సినీ నటుడు అలీ అంటే తమకు ఎంతో అభిమానమని, ఆయన పేరు మీదుగా తమ పేరు కూడా అలీ అని పెట్టుకున్నామని అక్బర్ అలీ తెలిపారు. జన్మదిన వేడుకలను కేవలం కేక్ కటింగ్ కే పరిమితం చేయకుండా సేవా కార్యక్రమంగా నిర్వహించడం విశేషం. ఈ సందర్భంగా గ్రామంలోని నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. అలీ చేస్తున్న సేవా కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని తాము కూడా ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామని నిర్వాహకులు పేర్కొన్నారు. అలీ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి అలీ మిత్ర మండలి అధ్యక్షులు దూదేకుల పెద్ద మస్తాన్,సభ్యులు బాసు వెంకటేశ్వర రెడ్డి, చెవుల రమేష్ యాదవ్, నారాయణ, బోసు, శేషూ, లక్ష్మయ్య తదితరులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

# ఘనంగా శ్రీ లక్ష్మీ నరసింహస్వామి పల్లకీ సేవ

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 10**

కేటీఆర్ టెక్నో స్కూల్ ప్రాంగణంలో వేంచేసియున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం లో శనివారం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి పల్లకి సేవాకార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. దేవస్థానం అర్చకులు చోడా వీరభద్రస్వామి పూజలు నిర్వహించి భక్తులుకు తీర్థప్రసాదాలు అందజేశారు. భక్తులకు దేవస్థానం కమిటీ వారు అల్పాహారం అందించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షులు కుందురు తిరుపతి రెడ్డి, కార్యదర్శి కొప్పురపు సత్యాలు, కోశాధికారి ఉప్పాల నరశింహరావు, జాయింట్ సెక్రటరీ ఉప్పాల సుబ్బారావు, దేవస్థాన కమిటీ సభ్యులు కంబాలదిన్నె శ్రీనివాసులు, పైడిమర్రి ప్రసాదు, మాలకొండారెడ్డి, చిరివెళ్ళ పార్ధసారథి, ఒంటేరు పెద్దన్న,నున్నా శ్రీ నివాసులు, శ్రీ రాం సురేష్ కుమార్, వెంకటప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# అధునాతన వైద్య సేవలను అందించడం లక్ష్యం

### కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్ -హెచ్ సి జి లో నూతన సదుపాయాలను ప్రారంభించిన రీజినల్ బిజినెస్ హెడ్ డాక్టర్ రూపాలి

### 5,000కు పైగా క్యాన్సర్ శస్త్రచికిత్సలు, 6,000 రేడియేషన్ థెరపీ చికిత్సలు

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 10**

సమగ్ర క్యాన్సర్ వైద్య సేవలను అందించడంలో హెచ్ సి జి నిబద్ధతను ప్రజలు విశ్వసిస్తున్నారని, రోగులకు నాణ్యమైన చికిత్స అందించడంతో పాటు, మెరుగైన వైద్య సేవలను నిరంతరం అందించడంపై ఆసుపత్రి ప్రత్యేక దృష్టి సారిస్తోందని కన్సల్టెంట్ మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ రాజేష్ తెలిపారు. శనివారం రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించడంలో భాగంగా, హెచ్ సి జి లో తాజాగా రెండు అధునాతన మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్లు, అత్యాధునిక ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసియు), ప్రత్యేక పోస్ట్ ఆపరేటివ్ వార్డు, అలాగే అధునాతన సెంట్రల్ స్టెరైల్ సర్వీసెస్ డిపార్ట్మెంట్ ( సిఎస్ఎస్డి) పరికరాలను ప్రారంభించారు. 2012 నుంచి ఒంగోలు ప్రజలకు క్యాన్సర్ వైద్య సేవలు అందిస్తున్న హెచ్ సి జి, అధునాతన క్యాన్సర్ చికిత్సలు, నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించాలనే తన లక్ష్యంతో ముందుకు సాగుతోందని హెచ్ సి జి రీజినల్ బిజినెస్ హెడ్ డాక్టర్ రూపాలి చెప్పారు. ఇప్పటివరకు 1,500కు పైగా రొమ్ము క్యాన్సర్ శస్త్రచికిత్సలు, 5,000కు పైగా క్యాన్సర్ సంబంధిత శస్త్రచికిత్సలు, 6,000 రేడియేషన్ థెరపీ చికిత్సలు అందించిన ఘనతతో, ఒంగోలు, పరిసర ప్రాంతాల ప్రజలకు సమగ్ర క్యాన్సర్ వైద్య సేవలను అందించేందుకు హెచ్ సి జి నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. ఈ సదుపాయాలు శస్త్రచికిత్సల నాణ్యతను పెంపొందించడం, ఇన్ఫెక్షన్ల నియంత్రణ, రోగుల భద్రత, శస్త్రచికిత్స అనంతర కోలుకునే ప్రక్రియను మెరుగుపరచడం లక్ష్యంగా రూపొందించబడ్డాయని తెలిపారు. ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాలను నిరంతరం అభివృద్ధి చేయడం, అధునాతన వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం పట్ల హెచ్ సి జి కు ఉన్న నిబద్ధతను ఈ కార్యక్రమం ప్రతిబింబించిందని అన్నారు. డాక్టర్ రఘునందన్, రేడియేషన్ ఆంకాలజిస్ట్ మాట్లాడుతూ, అధునాతన రేడియేషన్ సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. చికిత్సలో మరింత సౌలభ్యం కల్పించడంతో పాటు, రోగుల కోలుకునే ప్రక్రియకు ఈ సాంకేతికత ఎలా తోడ్పడుతుందో తెలియజేశారు. ఇప్పటివరకు 6,000కు పైగా రేడియేషన్ థెరపీ చికిత్సలు అందించడం ఆసుపత్రి వైద్య బృందం అంకితభావానికి, రోగి కేంద్రిత వైద్య సేవల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమాన్ని మూర్తి





సాతులూరి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ (సిఓఓ), మెహర్, మార్కెటింగ్ మేనేజర్ నిర్వహించారు. ఆసుపత్రిలో అభివృద్ధి చేసిన మౌలిక సదుపాయాలు, అధునాతన వైద్య సౌకర్యాలు, ఒంగోలు ప్రజలకు మరింత మెరుగైన ఆరోగ్య సేవలను అందించేందుకు చేపడుతున్న చర్యలను వారు వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రఘునందన్ ఒంగోలు మరియు పరిసర ప్రాంతాల ప్రజలు హెచ్ సి జి పై చూపిస్తున్న నిరంతర విశ్వాసానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అధునాతన క్యాన్సర్ చికిత్సలు, మానవీయ దృక్పథంతో కూడిన వైద్య సేవలు, మెరుగైన రోగి సంరక్షణను అందించేందుకు ఆసుపత్రి ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని పునరుద్ఘాటించారు.

# నేటి నుండి శ్రీ హరిహర క్షేత్రంలో శ్రీ దేవి నవరాత్రి మహోత్సవాలు

### - నిత్య అలంకారలతో భక్తులను అలరించనున్న అమ్మవారు

### - మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు దంపతుల ఆధ్వర్యంలో క్షేత్రంలో విశేష పూజలు



**ఒంగోలు కల్చరల్, పెన్ పవర్ అక్టోబర్ 10**

చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో జరగనున్న శ్రీ దేవి దసరా నవ రాత్రుల ఉత్సవాలు 11వ తేదీ ఆదివారం ప్రారంభం అవుతాయని మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మి పద్మావతి దంపతులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాలు అక్టోబర్ 20 వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మ కర్తలు శిద్దా రాఘవ రావు మాట్లాడుతూ ప్రతి ఏటా అనవాయితీ వైభవంగా శిద్దా వెంకట సుబ్బమ్మ, వెంకటేశ్వర్లు ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ దేవి దసరా శరన్నవ రాత్రులు వేడుకలు చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో ఆదివారం నుండి ప్రారంభం అవుతాయని మాజీ మంత్రి శిద్దా తెలిపారు. ఆదివారం అక్టోబర్ 11.10.26 ఆదివారం సాయంత్రం 6.30 నిముషాలకు బాల త్రిపుర సుందరి దేవి అలంకారం అంకురార్పణ తో శ్రీ హరి హర క్షేత్రంలో మహోత్సవాలు ప్రారంభం అవుతాయని ప్రతి రోజు అమ్మవారు వివిధ అలంకారాలతో భక్తులకు దర్శన భాగ్యంతో పాటు అమ్మవారికి విశేష పూజలు ప్రతి రోజు శ్రీ వాసవి అమ్మవారికి పంచామృత అభిషేకం,శ్రీ చక్ర నవార్చన, తీర్థ ప్రసాదాలు, శిద్దా లక్ష్మి పద్మావతి ఆధ్వర్యంలో ఉభయ దాతల పూజలు,ఆర్యవైశ్య మహిళా భక్తులచే సామూహిక శ్రీ లలిత సహస్ర నామ పారాయణం, కుంకుమ పూజలు నిత్యం అన్న ప్రసాద వినియోగం ఉంటుందని శిద్దా రాఘవ రావు తెలిపారు.

**అమ్మవారి అలంకరణ వివరాలు**

తొలి రోజు ఆదివారం అమ్మవారు శ్రీ బాల త్రిపుర సుందరి దేవి అలంకారం తో పాటుగా బాల పూజ నవ దుర్గ పూజ 12 వ తేది సోమవారం అమ్మవారు శ్రీ గాయత్రి దేవి తల్లి గా దర్శనంతో పాటు గాజుల అలంకరణ 13 వ తేది మంగళవారం అమ్మవారు శ్రీ అన్నపూర్ణ దేవి అలంకరణతో పాటు అమ్మవారు ధాన్యాభిషేకం, బుధవారం 14 వ తేది అమ్మవారు శ్రీ కంచి కామాక్షి దేవి అలంకరణతో పాటుగా సాయంత్రం వాసవి మహిళలచే మణిద్వీప వర్ణన సౌందర్య లహరి పారాయణం,తేది 15 గురువారం అమ్మవారు శ్రీ లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణ,తదుపరి అమ్మవారికి పసుపు కొమ్ములతో అలంకరణ,16 వ తేది శుక్రవారం అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకరణ సాయంత్రం సరస్వతి పూజ,శాస్త్రీయ నృత్య ప్రదర్శన,17 వ తేది శనివారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మి తల్లి గా భక్తులకు దర్శన భాగ్యం సాయంత్రం శ్రీ అష్ట లక్ష్మి పూజల కనకాభిషేకం,ఆదివారం అమ్మవారు శ్రీ దుర్గ దేవి అలంకారం సాయంత్రం వన దుర్గ దేవి అలంకరణ షోడాశ హరతులు,19 వ తేది సోమవారం అమ్మవారు శ్రీ మహిషాసుర మర్దని అలంకారం సాయంత్రం సువాసినులకు పసుపు కుంకుమ పంపిణి,20 వ తేది మంగళవారం అమ్మవారు శ్రీ రాజ రాజేశ్వరి దేవి అలంకారం సాయంత్రం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారుగా అలంకరణ తో పాటుగా చెరుకు గడలతో అమ్మవారి దర్శన భాగ్యం ఉంటుందని తెలిపారు. అదే రోజు రాత్రికి క్షేత్రంలో ని సాంగ సపరివార దేవతలకు శమీ పూజలు, శమీ దర్శనం,పార్వేట మహోత్సవం,పాల పిట్ట దర్శనం ఆలయ ధర్మ కర్తలు ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. కావునా భక్తులు అందరు ఈ మహోత్సవంలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని కోరుకుంటున్నట్లు తెలిపారు. శిద్దా వెంకటేశ్వర్లు.. వెంకట సుబ్బమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, వాహన సౌకర్యం ధర్మకర్తలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శ్రీ హరిహర క్షేత్రంలో జరిగే శ్రీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవంలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపాకటాక్షాలు పొందగలరని కోరుతున్నట్లు మాజీ శిద్దా రాఘవ రావు తెలిపారు.

# వెంకటేశ్వర స్వామి సన్నిధిలో బోయళ్ల నారాయణరెడ్డి



**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 10**

ప్రముఖ పుణ్యక్షేత్రమైన వరికుంటపాడులోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని శనివారం మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు గోత్రనామాలతో మంత్రోచ్చారణలు చేస్తూ ఆశీర్వచనం అందించారు. అనంతరం స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా బోయళ్ల నారాయణరెడ్డి మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర స్వామివారి దర్శనం మనసుకు ప్రశాంతతను, ఆధ్యాత్మిక చైతన్యాన్ని అందిస్తుందన్నారు. భగవంతుడిపై విశ్వాసం, భక్తిభావం మనిషికి మానసిక ధైర్యాన్ని కలిగిస్తాయని, ఇలాంటి పుణ్యక్షేత్రాలు భక్తి, ధర్మం, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తూ ప్రజల్లో ఆధ్యాత్మిక భావాలను పెంపొందిస్తున్నాయని తెలిపారు. స్వామివారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రేనాటి వెంకటేశ్వర్లు, జంకాల ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

# కూలిన వేప చెట్టు.. మూడు కార్లపై పడి తృటిలో తప్పిన పెను ప్రమాదం!

### పాఠశాలకు సెలవు కావడంతో తప్పిన ముప్పు..

### విద్యుత్ తీగలకు తప్పిన ప్రమాదం!

**గిద్దలూరు పెన్ పవర్ అక్టోబర్ 10**

పట్టణంలోని విశ్వభారతి స్కూల్ సమీపంలో వేప చెట్టు అకస్మాత్తుగా కూలి అక్కడే నిలిపి ఉంచిన మూడు కార్లపై పడింది. ఈ ఘటనతో స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే పాఠశాలకు సెలవు దినం కావడంతో పాటు, ఆ సమయంలో విద్యార్థుల రాకపోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సాధారణ రోజుల్లో ఈ మార్గంలో వాహనాలు, ప్రజల రాకపోకలు అధికంగా ఉంటాయని స్థానికులు తెలిపారు. చెట్టు కూలినప్పటికీ విద్యుత్ తీగలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే స్పందించిన కమిషనర్ ఈ వి రమణ బాబు వేప చెట్టు కూలిన సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డుపై అడ్డంగా పడిన చెట్టును పరిశీలించి, సిబ్బంది సహకారంతో తొలగించే చర్యలు చేపట్టారు. చెట్టును తొలగించడంతో రాకపోకలకు ఏర్పడిన అంతరాయం తొలగింది.



# పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా

**సి ఎస్ పురం, పెన్ పవర్ అక్టోబర్ 10**

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీసు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పటిష్టమైన ముందస్తు చర్యలు చేపట్టాలని మార్కాపురం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా పోలీసు అధికారులను ఆదేశించారు.శనివారం మండల కేంద్రంలోని సి ఎస్ పురం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి, స్టేషన్ పరిసరాలు, రికార్డులు, పెండింగ్ కేసులు, ఎన్నికలకు సంబంధించిన రికార్డులు, పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితిని సమీక్షించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై పలు కీలక సూచనలు చేశారు.ప్రతి పోలింగ్ కేంద్రాన్ని ముందుగానే పరిశీలించి, భవన పరిస్థితి, ప్రవేశం--నిష్క్రమణ మార్గాలు, విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, వాహనాల పార్కింగ్ తదితర సౌకర్యాలు, భద్రతాపరమైన అంశాలపై పూర్తి వివరాలు సిద్ధం చేసుకోవాలన్నారు గత ఎన్నికల్లో ఘర్షణలు, వివాదాలు, కేసులు నమోదైన గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించి, ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి రౌడీషీటర్లు, పాత నేరస్తులు, ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అవకాశం ఉన్న వ్యక్తుల కదలికలను నిరంతరం పర్యవేక్షించాలన్నారు అవసరమైన వ్యక్తులకు కౌన్సెలింగ్ నిర్వహించి, చట్టప్రకారం పిఐఆర్ నమోదు, సంబంధిత రెవెన్యూ అధికారుల సమక్షంలో బైండోవర్ చర్యలు చేపట్టాలి. పెండింగ్‌లో ఉన్న నాన్ బెయిలబుల్ వారెంట్ల ముద్దాయిల ఆచూకీ గుర్తించి, వారెంట్ల అమలుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు పెండింగ్ కేసులను సమీక్షిస్తూ, దర్యాప్తును వేగవంతం చేసి, చట్టపరమైన ప్రక్రియలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి. గ్రామ కానిస్టేబుళ్ల సహకారంతో గ్రామాల్లోని పాత వివాదాలు, భూవివాదాలు, రాజకీయ విభేదాలు, సున్నితమైన ప్రాంతాలు, ముఖ్యమైన వ్యక్తులకు సంబంధించిన శాంతిభద్రతల సమాచారాన్ని



ఎప్పటికప్పుడు సేకరించి సమస్యలు తలెత్తిన తర్వాత స్పందించడం కాకుండా, ముందస్తు సమాచారంతో వాటిని గుర్తించి, చట్టప్రకారం నివారణ చర్యలు చేపట్టి ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ, పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు ఎన్నికల నియమావళి, చట్టాలను పాటిస్తూ, ప్రజలందరికీ సమాన భద్రత కల్పించి, ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎన్నికల సమయంలో శాంతిభద్రతల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ముందస్తు ప్రణాళికతో విధులు నిర్వహించాలని ఎస్పీ స్పష్టం చేశారు.ఈ తనిఖీ సందర్భంగా పామూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి. వినోద్ కుమార్ , సి ఎస్ పురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ పి. వెంకటేశ్వరరెడ్డి కి ఎన్నికల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ, ముందస్తు చర్యలకు సంబంధించి పలు సూచనలు చేశారు.

# విజ్ఞాన్ విహార్ స్కూల్‌లో ఘనంగా ఫుడ్ ఫెస్టివల్

## -విద్యార్థులకు పోషకాహారంపై అవగాహన కల్పించడమే లక్ష్యం







**కందుకూరు, పెన్ పవర్, అక్టోబర్ 10**

కందుకూరులోని కోవూరు రోడ్డు బలరామయ్య తోట వద్ద ఉన్న విజ్ఞాన్ విహార్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో శనివారం ఫుడ్ ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడంతోపాటు, పోషకాహారం ప్రాముఖ్యతను తెలియజేయడం, సృజనాత్మకతను ప్రోత్సహించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాల కరస్పాండెంట్ జి. హరిబాబు, డైరెక్టర్ జి. అఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ-1 ఎం.ఎస్.కె. శర్మ, ఎంఈఓ-2 కె. సుబ్బారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించి తమ ప్రతిభను చాటుకున్నారు. సమతుల్య ఆహారం, పోషక విలువలు కలిగిన పదార్థాల ప్రాధాన్యత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన పొందారు. ఇటువంటి కార్యక్రమాల ద్వారా పుస్తక జ్ఞానంతోపాటు ఆచరణాత్మక పరిజ్ఞానం కూడా పెంపొందుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసానికి ఇలాంటి వినూత్న కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడటంతోపాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను కరస్పాండెంట్ జి. హరిబాబు, డైరెక్టర్ జి. అఖిల్ అభినందించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో ఫుడ్ ఫెస్టివల్ ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది.

## కనిగిరి జెడ్పీటీసీ బరిలో మూలే గోపాల్ రెడ్డి




**కనిగిరి, ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్ అక్టోబర్ 10**

కనిగిరి నియోజకవర్గంలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో కనిగిరి జెడ్పీటీసీ అభ్యర్థిత్వానికి సీనియర్ నేత మూలే గోపాల్ రెడ్డి పేరు దాదాపు ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది.

వైఎస్సార్సీపీ ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు ఏ ఒడిదుడుకులు వచ్చినా పార్టీని వీడకుండా జెండా మోసిన నాయకుడిగా మూలే గోపాల్ రెడ్డి కి పేరుంది. కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచి, కేడర్ ను కాపాడుకున్న నాయకుడిగా అధిష్టానం దృష్టిలో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంది. పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డి, తిరుపతి పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ లకు అత్యంత నమ్మకస్తుడిగా ఉన్నారు. నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలతో మంచి సంబంధాలు కలిగి ఉండటం ఆయనకు బలం.

**సేవలోనూ ముందు:** రాజకీయాలకే పరిమితం కాకుండా కరోనా సమయంలో, వరదల సమయంలో, పేదలకు నిత్యం అండగా ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా ముందుండి పరిష్కరించే తత్వం కారణంగా యువతలో, పెద్దల్లో ఆయనకు విశేష ఆదరణ ఉంది.

**టికెట్ ఆశిస్తున్న అభిమానులు:** మూలే గోపాల్ రెడ్డి లాంటి నమ్మకమైన, సేవా గుణం ఉన్న నాయకుడికి జెడ్పీటీసీ టికెట్ ఇస్తే కనిగిరి మండలంలో పార్టీకి తిరుగుండదని, భారీ మెజారిటీతో గెలుస్తారని ఆయన అనుచరులు, అభిమానులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అధిష్టానం కూడా ఆ దిశగానే ఆలోచిస్తున్నట్లు సమాచారం. అభ్యర్థిత్వం ఖరారైతే కనిగిరి మండలంలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోతాయని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో గోకవరం కొత్తపల్లి లలో పోలీస్ కవాతు.





**గోకవరం పెన్ పవర్ అక్టోబర్ 10:-** దసరా మహోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ ఎక్కువగా ఉండడంతో పోలీసులు నిఘా కొనసాగుతుంది. రేపటినుండి దసరా ఉత్సవాలు ప్రారంభమవడంతో ట్రాఫిక్ సమస్యలు ఉత్సవాలు ఏర్పాట్లు తదితర అంశాలపై నిరంతరం పోలీసులు దృష్టి సారించారు. శనివారం సాయంత్రం పోలీస్ బలగాలు మోహరించి గోకవరంలో మరియు కొత్తపల్లి గ్రామాలలో కవాతు నిర్వహించారు. గోకవరం ఎస్ ఐ పవన్ కుమార్ పర్యవేక్షణలో మహిళా ఎస్సై బి నాగమణి ఆధ్వర్యం లో ఈ కవాతు కు జరిగింది శాంతిభద్రతల పరిరక్షణ మరియు ట్రాఫిక్ ఇబ్బందులపై వివిధ షాపు యాజమాన్లకు ప్రజలకు అవగాహన కల్పించినట్లు తెలుస్తోంది.

## ఎన్నికల సంఘం రాజీనామా చేసే వరకు పోరాటం

ప్రజాస్వామ్య పరిరక్షణకు అఖిలపక్షం పిలుపు




**రాజమహేంద్రవరం, పెన్ పవర్, అక్టోబర్ 10:** ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భారత ఎన్నికల సంఘం కమిషనర్లు రాజీనామా చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత భారత ఎన్నికల సంఘంపై ఉందని పేర్కొన్నారు. స్థానిక కోటగుమ్మం సెంటర్‌లో శనివారం అఖిలపక్షం ఆధ్వర్యంలో భారత ఎన్నికల సంఘం తీరును నిరసిస్తూ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఎన్నికల వ్యవస్థలో పారదర్శకత, నిష్పక్షపాతంగా ఎన్నికల నిర్వహణ ఆవశ్యకతను ప్రస్తావించారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు విఘాతం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పునాది వంటివని, ప్రజలు తమకు నచ్చిన ప్రతినిధులను స్వేచ్ఛగా ఎన్నుకునే వాతావరణం ఉండాలని నాయకులు అన్నారు. ఎన్నికల సంఘం తన బాధ్యతలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. ఓటర్ల హక్కులకు భంగం కలిగించే పరిణామాలపై రాజకీయ పార్టీలు, ప్రజాస్వామ్యవాదులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగేలా చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించేందుకు అన్ని పార్టీలు ఐక్యంగా ముందుకు రావాలని నాయకులు స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం రాజీనామా చేయాలనే డిమాండ్‌తో తమ ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని తాటిపాక మధు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో అఖిలపక్ష నాయకులు, టీ కే. విశ్వేశ్వర్ రెడ్డి, హలో పట్నాల విజయకుమార్, నల్ల రామారావు, టి అరుణ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

## సైబర్ నేరాలు,దొంగతనాలు, మహిళలపై వేధింపులు తదితర వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలి

### స్థానిక సంస్థలు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలి

### కొమరోలు మండలం ముత్తరాసు పల్లి గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించిన ఎస్సై కోట నాగేంద్రరావు

**కొమరోలు పెన్ పవర్ అక్టోబర్ 10**

ప్రజలు సైబర్ నేరాలు, దొంగతనాలు,మహిళలు, బాలికలపై వేధింపులు, జూదాలు తదితర వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని కొమరోలు ఎస్సై కోట నాగేంద్రరావు కోరారు. శనివారం కొమరోలు మండలం తాటిచెర్ల పంచాయతీలోని ముత్తరాసు పల్లి గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలోఎస్సై నాగేంద్రరావు మాట్లాడుతూ, సమాజంలో సైబర్ నేరాలు అధికమవుతున్నాయని అందువల్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోరారు.కొత్త వ్యక్తుల ఫోన్లకు వారు పెట్టే మెసేజ్ లకు స్పందించవద్దని, అలాగే బ్యాంక్ అధికారులమని చెబుతూ బ్యాంకు అకౌంట్ల నెంబర్లు ఓటీపీలు, ఏటీఎం పిన్ నెంబర్లు తదితర వివరాలు అడిగి అకౌంట్లో ఉన్న డబ్బులు కాజేసేందుకు మోసగాళ్లు ప్రయత్నిస్తుంటారని ఆయన తెలిపారు. బ్యాంకు అధికారులు,సిబ్బంది ఎప్పుడూ కూడా తమ ఖాతాదారుల వివరాలు ఫోన్ల ద్వారా అడగరనే వాస్తవాన్ని గుర్తించి సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. విద్యార్థులు, యువకులు ఆన్లైన్ గేమ్లకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకోవడమే కాకుండా కొన్ని సందర్భాలలో చేసిన అప్పును తీర్చలేక ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు కూడా అనేక పెరుగుతున్నాయని, తద్వారా తల్లిదండ్రులకు కడుపుకోత కల్పిస్తున్నారని, అందువల్ల విద్యార్థులు, యువకులు ఆన్లైన్ గేమ్ లకు దూరంగా ఉండాలని ఆయన సూచించారు. గ్రామాలలో దొంగతనాలు, మహిళలు, బాలికలపై వేధింపులు తదితరవాటిని గమనిస్తూ సమాచారాన్ని తమకు తెలియజేయాలని, అపరిచిత వ్యక్తుల సంచారాన్ని వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ తమకు తెలియజేయాలని ఆయన కోరారు.




త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కొమరోలు మండలంలో ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగేందుకు అన్ని వర్గాల ప్రజలు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఎన్నికల సమయంలో జరిగే ఘర్షణలలో పాల్గొని కేసులలో చిక్కుకునే వారి భవిష్యత్తు అంధకారమవుతుందని ముఖ్యంగా యువత విద్యార్థులు పోలీస్ కేసులకు దూరంగా ఉండాలని ఆయన హెచ్చరించారు.. పేకాట మట్కా తదితర జూదాలు నాటు సారా తయారీ విక్రయాలు చట్టరీత్యా నేరమని అలాంటి సంబంధించిన కేసులలో చిక్కుకున్నవారు జైలు శిక్షలకు గురవుతారని ఆయన పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆయన ప్రజలకు సూచించారు. ఆ కార్యక్రమంలో కొమరోలు పోలీస్ సిబ్బంది ఆ గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాలకొండ ఆదాయం రూ 8,35,587

**వలేటివారిపాలెం, పెన్ పవర్ అక్టోబర్ 10**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ 8,35,587 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి శ్రీనివాసులు రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామి వారిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# నేటి నుంచి భైరవకోనలో శరన్నవరాత్రి ఉత్సవాలు

### భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి

### ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు



**సి ఎస్ పురం,పెన్ పవర్ అక్టోబర్ 10**

ప్రసిద్ధ శైవక్షేత్రం భైరవకోనలో దసరా శరన్నవరాత్రి వేడుకలకు సర్వం సిద్ధమైంది. భక్తుల కొంగుబంగారంగా కొలువుదీరిన శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారి ఉత్సవాలను ఆదివారం నుంచి ఈ నెల 20వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యామ్ సుందర్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో, కనిగిరి ఎమ్మెల్యే ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి సహాయ సహకారాలతో ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీకృష్ణారెడ్డి పర్యవేక్షణలో ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు శరన్నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా ఆదివారం ఉదయం ఆలయ వేద పండితుల ఆధ్వర్యంలో శ్ భర్గులేశ్వరస్వామి, కాలభైరవేశ్వరస్వామి, నగరేశ్వరస్వామి తదితర శివలింగాలకు అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు, అనంతరం ప్రత్యేక మండపము నందు శ్రీ త్రిముఖ దుర్గాదేవిని అలంకరణ చేసి గణాధిపతి పూజ, పుణ్యాహవసనం, రుద్రాభిషేకం , రుత్విక్ గ్వరణం, కలశ స్థాపన, శ్రీదేవి సప్తశతి పారాయణం, అగ్ని ప్రతిష్ట కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు అలాగే ప్రతిరోజు ఉదయం 6 గంటల నుండి విశేష పూజలు కుంకుమార్చనలు, బిల్వార్చనలు, ఉదయం 8 గంటల నుంచి రుద్ర దుర్గా గణపతి హోమాలు మంత్రపుష్ప కార్యక్రమాలు అలాగే ఉదయం 10 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం, 11 గంటలకు చండీ హోమం అనంతరం మహా నివేదన మంగళహారతి, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు శరన్నవరాత్రుల్లో భాగంగా అమ్మవారిని రోజుకో విశేష రూపంలో అలంకరించి దర్శన భాగ్యం కల్పించనున్నట్లు తెలిపారు మొదటిరోజు బాల త్రిపురసుందరిదేవిఅలంకారం, రాజరాజేశ్వరి దేవి అలంకారం, అన్నపూర్ణాదేవి అలంకారం, గాయత్రి దేవి అలంకారం, మోహిని దేవి అలంకారం, గజలక్ష్మి దేవి అలంకారం, సరస్వతి దేవి అలంకారం, మహిసాసురమర్ధని దేవి అలంకారం దుర్గాదేవి అలంకారం, లలితా దేవి అలంకారల్లో కొలువుదీరనున్నారు భైరవకోన క్షేత్రాలలో భక్తులు కుటుంబ సమేతంగా హాజరై అమ్మవారిని మరియు స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి విజయవంతం చేయాలని కోరారు.

## మాజీ ఎస్టీ జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులకు ఘన సన్మానం

**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ అక్టోబర్ 10**

స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోఇటీవల పదవీకాలం విజయవంతంగా పూర్తి చేసుకున్న మండల ఎస్టీ జెడ్పీటీసీ,ఎంపీటీసీ సభ్యుల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మండల గిరిజన నాయకులు మరియు ప్రజాప్రతినిధులు సభను ఉద్దేశించి మాట్లాడుతూ,గత ఐదేళ్ల కాలంలో గిరిజన ప్రాంతాల అభివృద్ధికి, ఎస్టీ ప్రజల సంక్షేమానికి పాలకమండలి సభ్యులు అందించిన నిరంతర సేవలను కొనియాడారు.ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో వారు చూపిన శ్రద్ధ, చొరవ అభినందనీయమని కొనియాడారు.స్థానిక ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ నాయకత్వంలో రాబోయే స్థానిక ఎన్నికల్లో గ్రామాలలో గెలుపు జెండా ఎగురావేయాలని, పదవి కాలం పూర్తయినా ప్రజా సేవలో ముందుండాలని కోరారు.అనంతరం పదవీకాలం పూర్తి చేసుకున్న ప్రతినిధులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల గిరిజన ముఖ్య నాయకులు, వైఎస్సార్సీపీ నాయకులు, పాల్గొన్నారు.



# పాకల బీచ్‌లో విషాదం

**సముద్ర స్నానానికి వచ్చి ఇద్దరు మృతి**

**అలల ఉధృతికి ఇంకో ఇద్దరు గల్లంతు**

**ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో ముగ్గురు**

**ఘటన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ**





**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం అక్టోబర్ 10:**

సింగరాయకొండ మండలం పాకల బీచ్ లో శనివారం విషాదం చోటుచేసుకుంది. సముద్ర స్నానానికి వచ్చిన వారిలో ఇద్దరు యువకులు అలల ఉధృతికి మృతి చెందారు. మరో ఇద్దరు గల్లంతు అయ్యారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురుని స్థానిక మత్స్యకారులు, పోలీసులు కాపాడారు. జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు ఘటన స్థలాన్ని సందర్శించి బాధిత కుటుంబ సభ్యుల ద్వారా వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రమాద తీరు, మృతుల వివరాలను వివరించారు. కనిగిరి మండలం శ్రీరంగపురం గ్రామం నుండి సుమారు 70 మంది తమ ఆచారం ప్రకారం పోలేరమ్మ జాతర జరుపుకొని, సముద్ర స్నానం చేయడానికి పాకల బీచ్‌కు వచ్చారు. అక్కడ స్నానం చేస్తుండగా ఒక పెద్ద అల వచ్చి కొందరిని లోపలికి లాక్కెళ్ళిందని ఆ బృంద సభ్యులు చెప్పినట్లు తెలిపారు. పరిస్థితిని గమనించిన స్థానిక మత్స్యకారులు, పోలీసు టవర్ వద్ద ఉన్న పోలీసులు వెంటనే స్పందించి బోట్ల ద్వారా కొంతమందిని రక్షించారన్నారు.

**మృతులు, క్షతగాత్రుల వివరాలు:**

మృతులు : పాలడుగు తేజ (20 ఏళ్లు), బత్తుల మహేష్ బాబు (22 ఏళ్లు).

గల్లంతయిన వారు : దేవల విష్ణు, దేవల నారాయణ.

చికిత్స పొందుతున్నవారు: మనోజ్ కుమార్, మహేష్ తేజ, నరసింహ. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం జి.జి.హెచ్ (ఒంగోలు), కందుకూరు కోటారెడ్డి ఆసుపత్రి ఒంగోలు రమేష్ ఆసుపత్రులలో క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందుతోందన్నారు. పోలీసు యంత్రాంగం మత్స్యకారులు గల్లయిన వారి ఆచూకీ కోసం డ్రోన్లు మరియు పడవల సహాయంతో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు ఆయన చెప్పారు. బాధిత కుటుంబాలకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని విధాల అండగా ఉంటుందన్నారు. బీచ్ కు వచ్చేవారు జాగ్రత్తగా ఉండాలని, భద్రతాపరంగా పోలీసు సిబ్బంది చేసే సూచనలను పాటించాలని కలెక్టర్ కోరారు. అనంతరం కందుకూరు కోటారెడ్డి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నరసింహను పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితి మెరుగుపడిందని, ఎలాంటి ప్రమాదము లేదని వైద్యులు తెలిపారు. ఈ సమయంలో కలెక్టర్ వెంట కందుకూరు సబ్ కలెక్టర్ డి.హిమవంశి, కందుకూరు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఇంద్రాణి ఉన్నారు.

## డాక్టర్ చాపల వంశీ కృష్ణకు ప్రతిష్ఠాత్మక ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం







**ఒంగోలు కలెక్టరేట్, పెన్ పవర్ అక్టోబర్ 10**

ఒంగోలులోని శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన సీనియర్ చీఫ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ చాపల వంశీ కృష్ణ కి ప్రతిష్ఠాత్మకమైన ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ లో స్థానం లభించింది. ఎముకల సాంద్రతను పరీక్షించి, ఆస్టియోపోరోసిస్ (ఎముకల బలహీనత) కారణంగా భవిష్యత్తులో ఎముకలు విరిగే ప్రమాదాన్ని ముందుగానే గుర్తించి, వాటిని నివారించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో డాక్టర్ వంశీ కృష్ణ 2010 నుంచి ప్రతి నెలా నిరంతరాయంగా బోన్ మినరల్ డెన్సిటీ (బిఎండి) స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఈ నిరంతర ప్రజారోగ్య సేవల్లో భాగంగా, డాక్టర్ చాపల వంశీ కృష్ణ మేయర్ ఆర్గానిక్స్ వారు 2025 డిసెంబర్ 3 న అత్యధిక సంఖ్యలో నిర్వహించిన బోన్ మినరల్ డెన్సిటీ స్క్రీనింగ్ క్యాంపులలో పాల్గొన్నందుకు ఆయనకు ఈ ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు శనివారం శ్రీరామ్ హాస్పిటల్‌కు విచ్చేసి డాక్టర్ వంశీ కృష్ణ కి దీనికి సంబంధించిన సర్టిఫికెట్‌ను అందజేశారు. ఎముకల ఆరోగ్యంపై అవగాహన -- ఫ్రాక్చర్ల నివారణ -- ఆరోగ్యకరమైన జీవనం అనే అంశంపై ప్రజలకు వైద్య సేవలు అందించడమే కాకుండా, వ్యాధులు రాకముందే వాటిని గుర్తించి నివారించాలనే లక్ష్యంతో డాక్టర్ వంశీ కృష్ణ చేస్తున్న నిరంతర కృషికి ఈ గుర్తింపు ఒక ప్రత్యేక మైలురాయి. ఈ సందర్భంగా డాక్టర్ వంశీ కృష్ణ ని వైద్యులు, మిత్రులు అభినందించారు.

## పోలీసు-మీడియా మధ్య సత్సంబంధాలు అవసరం

**ఎస్పీ పంకజ్ కుమార్ మీనా**

**ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఏపీయూడబ్ల్యూజే నాయకులు**

**మార్కాపురం, పెన్ పవర్ అక్టోబర్ 10**

మార్కాపురం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం స్నేహపూర్వక వాతావరణం నెలకొంది. ఉమ్మడి ప్రకాశం జిల్లా ఏపీయూడబ్ల్యూజే అధ్యక్షులు రమణ ఆధ్వర్యంలో జిల్లా జర్నలిస్టుల బృందం జిల్లా ఎస్పీ పంకజ్ కుమార్ మీనాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీ పంకజ్ కుమార్ మీనా జర్నలిస్టులతో చాలాసేపు ముచ్చటించారు. సమాజంలో పోలీసు వ్యవస్థకు, పత్రికా రంగానికి ఉన్న ప్రాధాన్యతను వివరించారు. ప్రజాస్వామ్యంలో పోలీసులు, జర్నలిస్టుల మధ్య స్నేహపూర్వకమైన, సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. పోలీసులకు ప్రజలకు మధ్య వారధిగా జర్నలిస్టులు వ్యవహరించాలని సూచించారు. జిల్లాలో ప్రస్తుతం నెలకొన్న శాంతిభద్రతల పరిస్థితులు, రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలపై పోలీసు శాఖ తీసుకుంటున్న చర్యలను ఎస్పీ వివరించారు. అలాగే జిల్లాలో జరుగుతున్న పలు అంశాలపై జర్నలిస్టుల అభిప్రాయాలను, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందనగా ఏపీయూడబ్ల్యూజే నాయకులు రమణ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు పోలీసు శాఖకు తమ పూర్తి సహకారం ఎప్పుడూ ఉంటుందని ఎస్పీకి తెలిపారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో, పోలీసులు చేపడుతున్న మంచి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో జర్నలిస్టులు ఎల్లప్పుడూ ముందుంటారని హామీ ఇచ్చారు. నూతనంగా ఏర్పడిన మార్కాపురం జిల్లాను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేందుకు పోలీసు, మీడియా సమన్వయం ఎంతో అవసరమని ఇరువురూ అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకులు, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.




## శ్రీ సంస్కృతి స్కూలులో దసరా ముందస్తు సంబరాలు







**కందుకూరు పెన్ పవర్, అక్టోబర్ 10**

పట్టణంలోని గుర్రం వారి పాలెం లో ఉన్న శ్రీ సంస్కృతి స్కూల్లో దసరా పండుగ సందర్భంగా ముందస్తు వేడుకలను శనివారం పాఠశాల ప్రాంగణంలో, అత్యంత వైభవంగా కోలాహాలంగా నిర్వహించారు. రాబోయే దసరా పండుగ సెలవులను దృష్టిలో ఉంచుకొని పాఠశాల యాజమాన్యం విద్యార్థులలో పండగ వాతావరణాన్ని, భారతీయ సంస్కృతి సాంప్రదాయాలను పెంపొందించేందుకు ఈ సంబరాలను ఏర్పాటు చేశారు. వేడుకలలో ముఖ్య విశేషాలు ఏమిటంటే బతుకమ్మ సంబరాలను విద్యార్థినిలు ఉపాధ్యాయులతో కలిసి రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి సాంప్రదాయ పాటలతో చప్పట్లు చరుస్తూ ఆనందంగా బతుకమ్మ ఆడారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, దేవి వేషధారణలు,దసరా ప్రాముఖ్యతను తెలిపే ప్రదర్శనలు, నాటికలు వీక్షకులను అలరించాయి. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కొంకా చంద్రశేఖర్ మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక దసరా పండగని, విద్యార్థులు కూడా తమలోని చెడు అలవాట్లను వీడి సన్మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. ప్రతి సంవత్సరం శ్రీ సంస్కృతి స్కూల్లో దసరా ముందస్తు వేడుకలను నిర్వహిస్తామని, ఈ వేడుకల ద్వారా పిల్లలకు మన యొక్క సాంప్రదాయాలు, సంస్కృతిని , తెలియజేయడమే ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన చైర్మన్ కొంకా చంద్రశేఖర్ కి, వైస్ ప్రిన్సిపల్ శోభారాణి కి, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులకు ప్రిన్సిపల్ హరి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అద్దంకిలో పోలీసుల 'కార్డన్ అండ్ సెర్చ్'

**చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు: సీ.ఐ సుబ్బరాజు.**






**అద్దంకి, ఆర్.సి(పెన్ పవర్) అక్టోబర్ 10:**

అద్దంకి పట్టణ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణే లక్ష్యంగా అద్దంకి పోలీసులు శనివారం సాయంత్రం రాజీవ్ కాలనీలో ముమ్మరంగా 'కార్డన్ అండ్ సెర్చ్' నిర్వహించారు. అద్దంకి సీ.ఐ సుబ్బరాజు నేతృత్వంలో పోలీస్ సిబ్బంది పెద్ద ఎత్తున ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. పోలీస్ బలగాలు బృందాలుగా ఏర్పడి రాజీవ్ కాలనీలోని అన్ని దారులను మూసివేసి, ప్రతి ఇంటినీ క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. కాలనీలో కొత్తగా వచ్చి నివసిస్తున్న వ్యక్తులు, అనుమానితుల పూర్వాపరాలను ఆరా తీసి వివరాలు నమోదు చేసుకున్నారు. సరైన ధ్రువపత్రాలు, రికార్డులు లేని ద్విచక్ర వాహనాలను గుర్తించి పరిశీలించారు. ?ఈ సందర్భంగా సీ.ఐ సుబ్బరాజు మాట్లాడుతూ.. పట్టణంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, గంజాయి, అక్రమ మద్యం రవాణా చేసినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాలనీల్లో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో స్థానికులు పోలీసులకు పూర్తి సహకారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఒంగోలులోని పలు ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయం

**- ఒంగోలు టౌన్ డిఈఈ కేవీ పాండురంగారావు**

**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 10**

33 కెవి లైన్ హాస్పటల్ ఫీడర్ లో టవర్ లైన్ వర్క్ లో భాగంగా ఆదివారం ఉదయం 09.00 గంటల నుండి 03.00 గంటల వరకు, మునిసిపల్ ఆఫీస్, శివాలయం, సివిఎన్ రీడింగ్ రూమ్ , కోర్ట్ సెంటర్, సెంట్రల్ కేఫ్ , ఏనుగు చెట్టు, గాంధీ రోడ్డు మొత్తం విద్యుత్ సరఫరాలో అంతరాయము ఉంటుందని, అదే విధంగా ఉదయం 07.00 గంటల నుండి 10:00 గంటల వరకు, 11 కెవి లైన్ లో వర్క్బ కారణంగా సుజాత నగర్, రెవెన్యూ కాలనీ, చెన్నకేశవమాన్యం పరిసరాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ విద్యుత్ డిఈఈ కేవీ పాండురంగారావు ఒక ప్రకటనలో తెలియజేశారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## 12న తలపెట్టిన మహా ధర్నాకు అనుమతి లేదు

**- జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు**



**ఒంగోలు క్రైమ్, పెన్ పవర్ అక్టోబర్ 10**

స్థానిక డి.ఎస్.పి. కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ చలో కలెక్టరేట్ కార్యక్రమానికి సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెలలో సింగరాయకొండ చైతన్య నవోదయ పాఠశాలలో తౌషిక్ అనే 11 ఏళ్ల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటనపై పోలీసు శాఖ ప్రత్యేక దర్యాప్తు చేపట్టిందని తెలిపారు. ఈ కేసుకు సంబంధించిన అంశాలు ప్రస్తుతం హైకోర్టు పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 12వ తేదీన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించేందుకు అనుమతులు కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు డీఎస్పీకి వినతిపత్రం సమర్పించారని తెలిపారు. గత కొన్ని రోజులుగా జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రౌండ్ టేబుల్ సమావేశాలు ఏర్పాటు చేసి, వాటికి భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని పిలుపునివ్వడం జరుగుతోందని ఆయన తెలిపారు. డీఎస్పీ కి సమర్పించిన వినతి పత్రంలో పేర్కొన్న అంశాలకు, రౌండ్ టేబుల్ సమావేశాల్లో చెబుతున్న విషయాలకు మధ్య వ్యత్యాసాలు ఉన్నందున, శాంతిభద్రతల సమస్యలు తలెత్తడంతో పాటు ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని ఎస్పీ తెలియజేశారు. పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్నందున, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా సభలు, సమావేశాలకు అనుమతులు రద్దు చేసినట్లు తెలిపారు. 163 బిఎన్ఎస్ఎస్ సెక్షన్ (144 సిఆర్పీసి సెక్షన్) అమల కొరకు ఆర్డిఓ కి అనుమతి కొరకు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ అంశాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుని, ఈ నెల 12వ తేదీన నిర్వహించ తలపెట్టిన ఛలో ఒంగోలు కలెక్టరేట్ కార్యక్రమానికి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ ధర్నాకు అనుమతులు లేనందున ప్రజలందరూ పోలీసు శాఖకు సహకరించి, ఈ ధర్నాలో పాల్గొనవద్దని ఈ సందర్భంగా ప్రజలందరికీ పోలీసు శాఖ తరపున విజ్ఞప్తి చేశారు. ఈ కేసుకు సంబంధించి గతంలో పలుమార్లు మీడియా సమావేశాలు నిర్వహించడంతో పాటు, కేసు వివరాలపై పలువురు పెద్దలతో మా డీఎస్పీ, సిబ్బంది ఎప్పటికప్పుడు చర్చిస్తూ వివరించడం జరిగిందని తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఎలాంటి గోప్యత పాటించడం లేదని, ప్రతి అంశాన్ని పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కేసు హైకోర్టు పర్యవేక్షణలో ఉన్నందున, సంబంధిత నివేదికలు, వివరాలను వెల్లడించాలంటే హైకోర్టు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందని, అందువల్ల కొన్ని విషయాలను ప్రస్తుతం వెల్లడించలేమని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు ఈ కేసుకు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే ముందుగా జిల్లా కలెక్టర్ ని, జిల్లా ఎస్పీ ని లేదా డీఎస్పీ ని కలిసి అడిగితే, కేసు విచారణకు సంబంధించిన వివరాలను పూర్తిగా వివరిస్తామని తెలిపారు. నిన్న కొన్ని వీడియోలను ప్రదర్శిస్తూ, కొన్ని అంశాలను ప్రస్తావించడం జరిగిందని తెలిపారు. మొదట బాలుడు బాగానే ఉన్నాడని, ఆ తర్వాత పరిస్థితి విషమించిందని చెబుతున్నారని, ఈ అంశాలకు సంబంధించి పోలీసు అధికారులను కలిసి అడిగితే, కేసు విచారణ ఎలా నిర్వహించారు, ఎలాంటి ఆధారాలు సేకరించారనే విషయాలను పూర్తిగా వివరించేవారమని తెలిపారు. పోలీసుల విచారణలో ఏవైనా లోపాలు ఉన్నట్లయితే, వాటిని పరిశీలించేందుకు హైకోర్టు పర్యవేక్షణ ఉన్న నేపథ్యంలో, కేసుకు సంబంధించిన అంశాలపై ప్రజలు పూర్తి వివరాలు తెలుసుకున్న తర్వాత మాట్లాడాలని తెలిపారు. ఈ నెల 12వ తేదీన ఒంగోలులోని జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించ తలపెట్టిన ధర్నాకు అనుమతులు లేనందున ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు ఎవరూ ఈ కార్యక్రమానికి హాజరుకావద్దని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, ఎస్ బి సి.ఐ శ్రీనివాసరావు,ఒంగోలు వన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, రూరల్ ఇన్స్పెక్టర్ శేషగిరి రావు,ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ హాజరత్తయ్య పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com